సూర్య
ఆదివారం
7.7.2024



# కాసులు కురిపించే
# కాశ్మీరీ కుంకుమపువ్వు





**నూకారపు సూర్యప్రకాశరావు**
**ఛైర్మన్, నేటి దిన పత్రిక సూర్య**

**తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు హాట్ హాట్‌గా మారుతున్నాయి. ఎన్నికలకు ముందే కాదు ఎన్నికలు అయిపోయిన తర్వాత కూడా ఎమ్మెల్యేలు గోడలు దూకుతున్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి చేరుతున్న నాయకుల సంఖ్య ఇప్పట్లో తగ్గేలా కనిపించడంలేదు. బీఆర్ఎస్ నుంచి ఇప్పటి వరకు దాదాపు 7 మంది వరకు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. ఇలా హస్తం పార్టీ కి జై కొడుతున్న వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. మీరేమంటారు..**

**– లోలుగు రామకృష్ణ ప్రసాద్, హైదరాబాద్**

అవును మీరంటున్నది నిజమే ప్రసాద్ గారూ...రోజు రోజుకు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరే వారి సంఖ్య పెరుగుతున్న తరుణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో ఇక ఎంత మంది కారు దిగతారు? కేసీఆర్‌కి హ్యాండ్ ఇచ్చే జాబితాలో ఎవరెవరు ఉన్నారు..? వలసలకు ఇకనైనా బ్రేక్ పడుతుందా..? అనేది తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. ఇంకెంత మంది పార్టీ మారతారు అనేది బీఆర్ఎస్ పార్టీని కలవరపెడుతుంది. ఇలాంటి తరుణంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో భేటీ కావడం సంచలనంగా మారింది.

అకస్మాత్తుగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కలవడం వెనుక అంతర్మథనం ఏమిటి అనేదానిపై పొలిటికల్ సర్కిల్‌లో చర్చ జరుగుతుంది. ఇకపోతే శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన గ్రేటర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల సమావేశానికి ఏడుగురు ఎమ్మెల్యేలు దుమ్మా కొట్టారు. ఆ సమావేశానికి హాజరుకాని ఎమ్మెల్యేలు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జాబితాలో ఉండటం కొత్త చర్చకు దారి తీస్తోంది. బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన గ్రేటర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సమావేశానికి దుమ్మా కొట్టి మరీ మంత్రి శ్రీధర్ బాబును కలవడంతో వీరంతా కూడా పార్టీ మారతారా? అనే చర్చ జరుగుతుంది. ఇప్పటికే ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హస్తం గూటికి చేరిన సంగతి తెలిసిందే. శనివారం గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ సైతం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఇలాంటి తరుణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుని కలవడం హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఎమ్మెల్యేలు అంతా తమ నియోజకవర్గాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరేందుకే కలిసినట్లు ప్రచారం జరుగుతుంది. అంతేకాదు తమ జిల్లా ఇంచార్జ్ మంత్రి కావడంతో నియోజకవర్గాలకు నిధులు కేటాయించాలని కోరినట్లు ఎమ్మెల్యేలు సైతం స్పష్టం చేస్తున్నారు.

## ఛైర్మన్‌తో ముఖాముఖి


**దివంగత సీఎం వైఎస్ఆర్ వారసత్వం విషయంలో తానే వారసురాలిని అని ప్రకటించుకునేందుకు షర్మిల ఎత్తుగడ వేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. గత ఎన్నికల నాటి నుంచి వైఎస్ఆర్ వారసత్వంపై హాట్ డిస్కర్షన్ జరిగింది. వైఎస్ జగన్ తానే వైఎస్ఆర్ వారసుడిని అని ప్రకటించుకున్నారు. తాను అసలైన వైఎస్ఆర్ వారసురాలినని షర్మిల సైతం ప్రకటించుకున్నారు. ఇలా వైఎస్ఆర్ వారసత్వంపై ఇరువురు మధ్య పొలిటికల్ పంచాయతీ జరిగిన సంగతి తెలిసిందే. ఇదే సందర్భంలో వైఎస్ జగన్‌ను వైఎస్ షర్మిల కడిగిపారేశారు. మరోమారు ఇది చిలికి చిలికి గాలివానగా మారుతోందనిపిస్తోంది. మీరేమంటారు సార్**

**–పాతుకూరి విజయలక్ష్మి, విజయవాడ**

అవును నాకూ అలానే అనిపించింది విజయగారు.. ఆ మధ్య వైఎస్ షర్మిల దేశాన ప్రశ్నలకు వైఎస్ జగన్ ఏమాత్రం సమాధానం ఇవ్వకపోగా వ్యక్తిగతంగా విమర్శలు చేశారు. చివరకు వైఎస్ షర్మిల ధరించిన చీర రంగును సైతం ప్రస్తావిస్తూ విమర్శలు గుప్పించారు. వైఎస్ షర్మిల చంద్రబాబు నాయుడుతో కుమ్మక్కు అయ్యారని సంచలన ఆరోపణలు చేశారు. అయినప్పటికీ వైఎస్ షర్మిల ఏమాత్రం ఆగిపోలేదు. వైఎస్ఆర్ వారసత్వంపై బలంగానే పోరాటం చేశారు. ఇప్పుడు అదే మరోసారి రుజువు చేయబోతున్నట్లు తెలుస్తోంది.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీలోని పలు ప్రాంతాల్లో వైఎస్ఆర్ విగ్రహాలు కూలిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై వైఎస్ జగన్ ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వాన్ని నిలదీయలేదు. కానీ వైఎస్ షర్మిల మాత్రం నిలదీశారు. ఏపీ వ్యాప్తంగా వైఎస్ఆర్ విగ్రహాలను కూలదోస్తున్నారని.. ఇది అప్రజాస్వామికమని షర్మిల కూతురుగా, కాంగ్రెస్ నేతగా వైఎస్ షర్మిల గళం వినిపించారు. ఈ విషయంలో జగన్ మాత్రం గవర్నర్‌కు ఓ లేఖ రాసి మమ అనిపించేశారు. ఈ రెండూ ఒక ఎత్తు అయితే జూలై 8న వైఎస్ఆర్ 75వ పుట్టిన రోజు సందర్భంగా వైఎస్ షర్మిల దూకుడుగా ముందుకు సాగుతున్న సంగతి తెలిసిందే. విజయవాడలో నిర్వహించ నున్న భారీ కార్యక్రమంలో పాల్గొనాలంటూ ఇప్పటికే షర్మిల జాతీయస్థాయి నాయకులను ఆహ్వానిస్తున్నారు. కానీ సీఎం వైఎస్ జగన్ మాత్రం తండ్రి వైఎస్ జయంతిని నిర్వహించే అంశంపై ఇప్పటికీ నోరు విప్పకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఏదేమైనప్పటికీ వైఎస్ షర్మిల తన తండ్రి వైఎస్ఆర్ జయంతి వేడుకలలో సోదరుడు వైఎస్ జగన్‌ను మించిపోయారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## లెజెండ్

# చాణక్య నీతికి ప్రతిరూపం వై. యస్.




యెడుగూరి సందింటి రాజశేఖరరెడ్డి (జూలై 8, 1949 – సెప్టెంబర్ 2, 2009) ఆంధ్ర ప్రదేశ్ 16వ ముఖ్యమంత్రిగా, కాంగ్రెస్ పార్టీ నాయకునిగా, ప్రత్యేక గుర్తింపు పొందిన జన హృదయ నేత. తల పండిన నేతలను తల దన్నిన వ్యూహ రచనా దురంధరుడు ఆయన. మునిగి పోతున్న కాంగ్రెస్ నావను ఒంటి చేత్తో దరికి చేర్చిన రథ సారథి ఆయన. రాజకీయాలకు సరి కొత్త అర్థం చెప్పిన చాణక్యుడు వై.యస్...రాజశేఖర్ రెడ్డి 1949 జూలై 8న జమ్మల మడుగులోని సి.ఎస్.ఐ. కాంప్‌బెల్ మిషన్ ఆసుపత్రిలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు జయమ్మ, రాజారెడ్డి. ఆయన తండ్రి బళ్ళారిలో కాంట్రాక్టరుగా పనిచేస్తుండటం వల్ల ఆయన పాఠశాల చదువంతా బళ్ళారిలోని సెయిట్ జాన్స్ పాఠశాలలో సాగింది. ఆ తర్వాత విజయవాడ లయోలా కళాశాలలో చేరాడు. 1972లో గుల్బర్గా విశ్వ విద్యాలయం నుంచి వైద్య విద్యలో పట్టా పుచ్చు కున్నారు. గుల్బర్గాలోని మహాదేవప్ప రాంపూరే వైద్య కళాశాలలో వైద్యవృత్తిని అభ్యసిస్తుండగానే కళాశాల విద్యార్థి సంఘానికి అధ్యక్షుడిగా వ్యవహరించారు. శ్రీ వెంకటేశ్వర వైద్యకళాశాల (యెస్.వి.ఆర్.ఆర్), తిరుపతి నుంచి హౌస్‌సర్జన్ పట్టా పొందారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల వైపు ఆకర్షితుడైన రాజశేఖరరెడ్డి యెస్.వి.ఆర్.ఆర్ కళాశాలలో పని చేస్తుండగానే అక్కడ హౌస్‌సర్జన్ సంఘం అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. తరువాత కొద్ది రోజులపాటు జమ్మల మడుగులోని సి.ఎస్.ఐ. కాంప్‌బెల్ ఆసుపత్రిలో వైద్య అధికారిగా పనిచేశారు. ఆ తరువాత 1973లో పులివెందులలో తండ్రి వై.ఎస్.రాజారెడ్డి పేరుతో కట్టించిన 70 పడకల ఆసుపత్రిలో వైద్యుడిగా పనిచేశారు. ఆ ఆసుపత్రి ఇప్పటికీ పనిచేస్తూనే ఉంది. వాళ్ళ కుటుంబం పులివెందులలో ఒక పాలిటెక్నిక్ కళాశాల, డిగ్రీ కళాశాలను కూడా నెలకొల్పారు. తరువాత వాటిని లయోలా సంస్థలకు అప్పగించారు. పులివెందుల దగ్గరిలో ఉన్న సింహాద్రి పురంలో ఉన్న కళాశాలను మాత్రం ఇప్పటికీ వీరి కుటుంబమే నిర్వహిస్తోంది.

కళాశాల దశ నుంచే రాజకీయాలపై ఆసక్తి చూపిన రాజశేఖరరెడ్డి 1980–83 కాలంలో రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రి పదవిని నిర్వహించారు. కడప లోక్‌సభ నియోజకవర్గం నుంచి 4 సార్లు ఎన్నికయ్యారు. పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 6 సార్లు విజయం సాధించారు. రాష్ట్ర శాసనసభ ప్రతిపక్ష నేతగా, రెండు సార్లు రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగానూ పనిచేశారు. 1980 నుంచి 1983 దాకా గ్రామీణాభివృద్ధి, వైద్యశాఖ, విద్యాశాఖ మొదలైన కీలకమైన మంత్రి పదవులను నిర్వహించారు. తెలుగు దేశం నేత నారా చంద్రబాబు నాయుడు మొదటగా కాంగ్రెస్ లో ఉన్నపుడు ఇరువురూ మంచి మిత్రులు. 1985 నుంచి 1998 వరకు పార్టీలో వై.ఎస్. నిత్య అసమ్మతి వాదిగా పేరు పద్దారు. కాంగ్రెస్ ముఖ్య మంత్రులు అందరితో ఆయన పోరాటం చేయాల్సి వచ్చింది. 1989–94 మధ్య కాలంలో ముఖ్య మంత్రి కావాలని ప్రయత్నించినా సాధ్య పడలేదు. మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్దన్ రెడ్డి, కోట్ల విజయ భాస్కర్ రెడ్డి వంటి నేతలతో ఆయన రాజకీయ యుద్ధమే చేశారు. వారికి వ్యతిరేకంగా క్యాంపులు నడిపారు. మర్రి చెన్నారెడ్డిని, నేదురుమిల్లి జనార్ధన్‌రెడ్డిని పదవి నుండి తొలగించడానికి ప్రధాన కారణమైన హైదరాబాదు నగరంలో జరిగిన అల్లర్లలో రాజశేఖర్ రెడ్డి వర్గపు పాత్ర ఉందన్న ఆరోపణలు వచ్చాయి. అదే తాను ముఖ్యమంత్రి అయ్యేనాటికి అలాంటి శిబిరాలు లేని పరిస్థితిని సృష్టించు కోగలిగారు. రాజకీయాల్లో ముక్కు సూటి తనానికి, నిర్మొహమాట ధోరణికి రాజశేఖరరెడ్డి నిలువెత్తు నిదర్శనం. ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా వై.ఎస్.రాజశేఖరరెడ్డి రెండు సార్లు పనిచేశారు. తొలిసారి 1983 నుంచి 1985 వరకు, రెండో పర్యాయం 1998 నుంచి 2000 వరకు ఆ పదవిలో ఉన్నారు. 1999 నుంచి 2004 వరకు 11 వ శాసనసభలో ప్రతిపక్ష నేత గానూ వ్యవహరించారు. 2003 వేసవి కాలంలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో పాద యాత్ర చేపట్టి 1,467 కిలోమీటర్లు పర్యటించారు. పాదయాత్ర వలన వ్యక్తిగతంగా వైఎస్.కు మంచి జనాదరణ లభించడమే కాకుండా ఆ తదుపరి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి దోహద పడింది. 2004 మేలో జరిగిన 12వ శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికస్థానాలు సాధించడంతో అదివరకే పార్టీలో పేరు సంపాదించిన వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించాడు. పాదయాత్ర వలన జనాదరణ పొందడమే కాకుండా ఎన్నికల ప్రచారంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, పెండింగులో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తిచేయటం, జలయజ్ఞంలకు ప్రాధాన్యం ఇవ్వడంతో ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన పిదప తొలి సంతకం ఉచిత విద్యుత్తు ఫైలు పైనే చేశారు. 2009 ఏప్రిల్లో జరిగిన 13వ శాసనసభ ఎన్నికలలో కూడా కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలలో విజయం సాధించడానికి కృషిచేసి వరుసగా రెండో పర్యాయం ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు. 2009 ఏప్రిల్లో జరిగిన శాసనసభ, లోక్‌సభ ఎన్నికలలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ముందుండి నడిపించడమే కాకుండా శాసనసభలో 156 స్థానాలతో పూర్తి మెజారిటీని సంపాదించిపెట్టాడు. అదే సమయంలో లోక్‌సభ ఎన్నికలలో 33 స్థానాలలో విజయం సాధించడానికి కృషి చేశారు.వై.యస్. రాజశేఖరరెడ్డి చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా (సి.ఎస్.ఐ) అనే చర్చికి చెందిన ప్రొటెస్టెంటు క్రైస్తవుడు. ఆయన తొలిసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత 2004లోనూ, మరలా 2009లోనూ కుటుంబ సమేతంగా బెత్లహేము యాత్రకు వెళ్ళి వచ్చాడు. క్రైస్తవులైనా పారంపరికంగా వచ్చిన హిందూ సంప్రదాయాలని వీడలేదు. రాజశేఖరరెడ్డి తిరుమలను అనేకమార్లు సందర్శించి వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకొని పూజలు చేశారు. ఆయన అల్లుడు అనిల్ కుమార్ మత ప్రచారకులు. బ్రాహ్మణుడైన అనిల్ కుమార్ రాజశేఖర్ రెడ్డి కూతురు షర్మిలాను పెళ్ళి చేసుకున్న తర్వాత క్రైస్తవం స్వీకరించి మత ప్రచారకు డయ్యారు. సెప్టెంబర్ 2, 2009 న చిత్తూరు జిల్లా పర్యటనకు బయలు దేరగా ఉదయం గం.9.35 నిమిషాలకు హెలికాప్టరుతో సంబంధాలు తెగి పోయాయి. ముఖ్యమంత్రి ఆచూకీ కోసం గాలించగా 25 గంటల తరువాత ప్రమాదానికి గురైన హెలికాప్టర్ ఆనవాళ్ళు లభించాయి. వై.ఎస్.తో సహా మొత్తం ఐదుగురు హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. తమ అభిమాన నాయకుని మరణాన్ని జీర్ణించుకో లేక రాష్ట్ర మంతా దాదాపు 67 మంది మరణించారు. వీరిలో చాలా మంది గుండె ఆగి మరణించగా కొద్ది మంది ఆత్మహత్య చేసుకున్నారు.

## నవ కవిత్వం

### అలల మీద కలలా !



ఎన్నేళ్ళు గడిచాయో
ఎటెళ్ళి పోయావో
ఎక్కడని వెతకను !
వెతుకులాటలో అలసి
గొంతు తడియారి పోతుంటే

గుక్కెడు నీళ్ళు తాగటానికి
రెండు చేతుల్ని దగ్గరకు తెచ్చా
దోసిట్లో నీ ముఖం
గృహలక్ష్మిలాజి
అలల మీద కలలా
కదలాడుతున్న నీ రూపం

నీరు తాగానా
నీ రూపం మాయం
తాగకున్నానాజి
నా మరణం ఖాయం
ఏం చేయను ప్రియా !

విడిపోయిన దోసిళ్ళు
జారిపోయిన నీళ్ళు
మూతపడ్డ కళ్ళు
సంతృప్తి పరవళ్ళు !

– సురేంద్ర రొడ్డ
9491523570

## లేఖలు




**ముఖచిత్ర కథనం బాగుంది**తెలంగాణ కళా రూపాలపై ప్రత్యేక కథనం ఆదివారం అనుబంధంలో ప్రచురించడం హర్షణీయం. మనకు దగ్గరలోనే సదరు ప్రదర్శనలు జరిగినా వాటి గురించి తెలియకపోవటం విచారకరమే. ఈ తరహా వ్యాసాలు పూర్తి స్థాయిలో మరిన్ని వెలువరించాలని కోరుకుంటున్నాం. రచయితకు, ప్రచురించిన సంపాదక వర్గానికి ధన్యవాదాలు. ఈ తరహా మరిన్ని వ్యాసాలు ప్రచురిం చాలని కోరుకుంటున్నాం. ప్రచురించిన ఎడిటర్, యాజమాన్యాలకు ధన్యవాదాలు. సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఒతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుంటుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని నా మనవి.

**– వారాంతపు రజనీ, వరంగల్**

**–బి మధుశేఖర్, హైదరాబాద్**

**సినిమా రివ్యూలు బాగున్నాయ్**

వారం వారం విడుదలవుతున్న చిత్రాలలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుఫణుల పనితీరును అర్ధవంతంగా వివరి స్తున్న విశ్లేషకులకు ధన్యావాదా లు. ప్రధానంగా ధియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.

**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరందిస్తున్న ప్రోత్సాహం బాగుం ది. . రచిత కథనా న్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచ నలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు

**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**


## భావ వీచికలు




సఖీ!
మబ్బులు లేని రాకానిశిలో
కలువలరేడు చంద్రికలు
వెదజల్లుతున్న వేళ,
పుచ్చపూవులా పూసిన
ఆ పండు పున్నమి వెన్నెలలో,
మనసును తాకుతున్న
వసంత సమీరాలు
నీతో నా గోడు
వెళ్లబోసుకోమంటుంటే,
కూడబలుక్కున్న అక్షరాలు
తమను తాము అల్లుకోగా...
అదేమిటో గానీ!
నీ తలంపు రాగానే
మిలమిలలాడే
నీ కన్నుల మెరుపుదనం
మదిలో మెదిలి
మనసు స్వేచ్ఛావాయువులతో
తేలికపడుతుంది.
తపస్సుచేస్తే తప్ప
లభించని ప్రశాంతత
నాదౌతుంది.
కిసలయరాగాలవంటి
నీ పెదవులపై
వెన్నెలజల్లులా
కురిసే దరహాసం
నా ఎదలో సుమవర్షం
కురిపిస్తుంది.
నిను అలానే చూస్తూ
ఉండిపోవాలనిపిస్తుంది.
అలసిన మనసుకు
ఆదరువుగా నిలుస్తూ,
ప్రతిచూపులోనూ
కొత్తగా కనపడే నీవు
నా సంతోషాలకు నిలయం.
ఎదలో వీచే భావవీచికలను
మాటలతో వర్ణించలేమేమో!

**వేమూరి శ్రీనివాస్**
**9912128967**



## సూర్య బుడత

**బాలల కథ**

# స్నేహానికి అందం అడ్డుకాదు



ఆ చెట్టుమీద పావురాలు ,కొంగలు ,పిచుకలు , ఎన్నో వున్నాయి .కానీ ఆ చెట్టుమీద ఒక్క కాకి. ఒక చిలుక మాత్రమే వుంది . చిలుకను చూస్తే కాకికి చాలా కోపం కలిగేది. ఏందుకంటే, చెట్టుమీదున్నఇతర పావురాలు,కొంగలు ,పిచుకలు చిలుకతో చాలా స్నేహంగా వుండసాగింది. తనతో ఎవరూ స్నేహంగా ఉండకపోవడంతో ఆ చిలుకపై కోపం కలిగింది . చిలుక అందంగా ఉందని అందరూ చిలుకతో స్నేహం చేస్తున్నారు అని పొరపాటున అర్థం చేసుకొంది.

నగరంలో ఒక చిత్రకారుడు రహదారి ప్రక్కనున్న ఇంటిగోడమీద చిత్రం గీయడంలో మునిగిపోయాడు .ఆ సమయంలో చిత్రకారుడు గోడ మీద ఒక చిలుకబోమ్మ చిత్రించడం చూసిన కాకికి ఒక్కసారిగా కోపం వచ్చింది .అతను ఉంచుకొన్న రంగుల పాత్రలను వేగంగా తన్నింది . ఆ చిత్రకారుడు రంగులున్న పాత్రల ప్రక్కన ఒక విష పాము ఉండటం చూసి ఉలిక్కిపడ్డాడు . విషపాము కాటువేయకుండా కాకి కాపాడిందని అనుకొని కృతజ్ఞతతో కాకి వైపు చూస్తూ "నేను మామూలు చిత్ర కారుడిని. నీకేమి ఇచ్చి నీ ఋణం తీర్చుకొనగలను "అన్నాడు

"నీ రంగులు వుపయోగించి నన్ను చిలుకలా మార్చగలవా "అడిగింది

చిత్రకారుడు రంగులు వుపయోగించి రెక్కలు చిలుకరంగులు ఉండేలా చిత్రించాడు

"ఓ కాకీ నిన్ను చిలుకలా ఉండేలా రంగులు వేసినా నీ ముక్కును మాత్రం చిలుక ముక్కులా చేయలేకపోయాను " అంటూ అద్దంలో చూసుకొనేలా చూపించాడు

"నా ముక్కు చిలుక ముక్కులా లేకున్నా చూడటానికి చిలుకలా వున్నాను అనుకొంటూ చెట్టుదగ్గరకు వెళ్ళింది "

ఈ సారి పక్షులతో వెళ్లి మాట్లాడగానే అవీ స్నేహంతో మాట్లాడింది.

"నేను చిలుక రంగు వేసుకొన్నందువలన మీరు నాతో స్నేహంగా మాట్లాడారు "అంది కాకి


"స్నేహానికి అందం అనేది అడ్డుకాదు ,ఇంతకాలం నీవు మాకు దూరంగా వున్నావు. ఇప్పుడు మా దగ్గరకు వచ్చావు కాబట్టి మాట్లాడాము " అంది పావురం


"నేను నల్లగా వున్నానని మీరు మాట్లాడరని తప్పుగా భావించాను. నన్ను క్షమించండి "అంది కాకి

ఆ రాత్రి కురిసిన వర్షం వలన కాకి మీదున్న చిలుక రంగులు పోయి నల్లటి కాకిలా తయారయినా పక్షులన్నీ స్నేహంతో మాట్లాడటం చూసి సంతోషించింది


(అయిపోయింది)

**ఓట్ర ప్రకాష్ రావు, 9787446026**





| | | | | | |
|---|---|---|---|---|---|
| 5 | | | | 4 | |
| | | 3 | 5 | | |
| | | 4 | | | 5 |
| 6 | | | 4 | | |
| | | 5 | 3 | | |
| | 1 | | | | |



# బీమాలో మార్పును ప్రోత్సహిస్తున్న పీబీ పార్ట్‌నర్స్

pbpartners.com
EK RISHTA BHAROSE KA

బీమా ఉత్పత్తులపై అవగాహన వృద్ధి చెందుతున్నప్పటికీ, ముఖ్యంగా కొవిడ్-19 తర్వాత, భారతదేశంలో బీమా వ్యాప్తి ముఖ్యంగా టైర్-2 మరియు టైర్-3 నగరాల్లో 5% కన్నా తక్కువగా ఉంది. తాము తీసుకుంటున్న బీమా పాలసీలలో డాక్యుమెంటేషన్ ప్రక్రియ అనిశ్చితంగా ఉండడంతో ఈ నగరాల్లోని ఉంటున్న వారు బీమా పాలసీలను కొనుగోలు చేసేందుకు వెనకాడుతున్నారు. వెనుకబడిన ప్రాంతాల్లోని వ్యక్తులు ఆన్‌లైన్‌లో బీమా సేవల కోసం శోధిస్తున్నప్పటికీ, కొనుగోలు చేసేందుకు ముందుగా వారు వ్యక్తిగతంగా తాము విశ్వసించగలిగిన- ఏజెంట్ భాగస్వామిని భేటీ అయ్యేందుకు ఇష్టపడుతున్నారు.

**బీమా పరిశ్రమ వృద్ధి**

బీమా పరిశ్రమ గత కొన్ని ఏళ్లలో ఆకట్టుకునే వృద్ధిని సాధించింది. పురోగతి ఉన్నప్పటికీ, బీమా ప్రయోజనాలను గుర్తించినప్పటికీ వెనుకంజలో ఉన్న మారుమూల ప్రాంతాల్లోని ప్రజలను ఆర్థికంగా రక్షించడంలో ఒక ముఖ్యమైన సవాలు మిగిలి ఉంది.

పాలసీబజార్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్‌లో భాగమైన పీబీ పార్ట్‌నర్స్ బీమా వ్యాప్తి, అవగాహన తక్కువగా ఉన్న ప్రాంతాలతో సహా దేశంలోని ప్రతి మూలకు చేరుకుని, మెట్రో నగరాలకు మించి బీమా సౌలభ్యాన్ని విస్తరించడంలో అగ్రగామిగా నిలిచింది. పీబీ పార్ట్‌నర్స్ తమ %ూశీూ% (పాయింట్ ఆఫ్ సేల్ పర్సన్) మోడల్ ద్వారా, ముఖ్యంగా తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్‌లో ఈ సవాలును ఎదుర్కోవడంలో చెప్పుకోదగ్గ పురోగతిని సాధించింది. తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ లలో, పాయింట్ ఆఫ్ సేల్స్ పర్సన్ మోడల్ బీమా వ్యాప్తిని గణనీయంగా పెంచింది. మోడల్ మొత్తం బీమా ప్రక్రియను సులభతరం చేస్తూ, నివాసితులందరికీ ఆర్థిక రక్షణ కల్పించే వ్యక్తిగత సహాయాన్ని అందిస్తోంది. ఈ మోడల్ ఆన్-గ్రౌండ్ ఏజెంట్ భాగస్వాముల వ్యక్తిగత స్పర్శతో డిజిటల్ సాధనాల సామర్థ్యాన్ని మిళితం చేస్తుంది, ఫలితంగా దక్షిణాది అంతటా వినియోగదారుల నుంచి సానుకూల స్పందన లభిస్తోంది.

అలాగే, భారతదేశంలో బీమాను విక్రయించే మరియు కొనుగోలు చేసే విధానాన్ని సాంకేతికత పూర్తిగా మార్చేసింది. పీబీపార్ట్‌నర్స్‌లో పాయింట్ ఆఫ్ సేల్స్‌పర్సన్ ఏజెంట్ భాగస్వాములు ఇప్పుడు ప్రతి వినియోగదారుల నిర్దిష్ట అవసరాలను తీర్చేందుకు వారి వద్ద పోలిక, వేగవంతమైన కొటేషన్ల కోసం డిజిటల్ పరికరాలను కలిగి ఉన్నారు. అదనంగా, ఏజెంట్ భాగస్వాములు మోటార్ బీమా క్లెయిమ్‌ల ప్రక్రియను క్రమబద్ధీకరించేందుకు, సంక్లిష్టతలను తగ్గించేందుకు, సెటిల్‌మెంట్‌లను వేగవంతం చేసేందుకు పీబీ ఇన్‌స్పెక్ట్ వంటి ఏఐ-ఆధారిత సాధనాలను కలిగి ఉన్నారు. తెలంగాణలోని ప్రజల అవసరాలను తీర్చడంలో, బీమా డెలివరీలో చివరి మైలు అంతరాన్ని సమర్థవంతంగా తగ్గించడంలో పాయింట్ ఆఫ్ సేల్స్‌పర్సన్ ఏజెంట్ భాగస్వాములకు టెక్నాలజీ సహాయం చేస్తోంది.

**సవాళ్లు మరియు అవకాశాలు**

బీమా పాలసీని పొందడంలో అంతులేని రాతపని, సంక్లిష్టమైన విధానాలు ఉంటాయని చాలా మంది విశ్వసిస్తారు. అదనంగా, బీమా పేరిట మోసాల పెరుగుతున్నందున నమ్మకంమరియు విశ్వసనీయత సమస్యలు తలెత్తాయి. ఈ అంశాలు బీమాను కొనుగోలు చేయకుండా వ్యక్తులను మరింత నిరోధిస్తుంది. పాయింట్ ఆఫ్ సేల్ పర్సన్ మోడల్ ద్వారా ఈ సవాళ్లను పీబీ పార్ట్‌నర్స్ సమర్థవంతంగా పరిష్కరించింది. ఇది తక్కువ సేవలు అందుబాటులో ఉన్న ఆర్థిక చేరికను గణనీయంగా అభివృద్ధి చేసింది. బీమా ప్రక్రియను సులభతరం చేయడం ద్వారా మరియు దాని ప్రయోజనాలపై కస్టమర్‌లకు అవగాహన కల్పించడం ద్వారా, పీబీ పార్ట్‌నర్స్ అవగాహనలను మారుస్తున్నారు మరియు పరిశ్రమపై నమ్మకాన్ని పెంచుతున్నారు. పాయింట్ ఆఫ్ సేల్ పర్సన్ ఇంటరాక్టివ్ మరియు ఏజెంట్-ఫోకస్డ్ విధానం బీమాకు సంబంధించిన సందేహాలను, అపోహలను తొలగించడంలో కీలకంగా ఉంది.

ఏజెంట్ భాగస్వాములకు అవకాశాలు, మద్దతును అందించడం ద్వారా, పీబీ పార్ట్‌నర్స్ పరిశ్రమలోని సవాళ్లను అధిగమించడంలో వారికి సహాయపడటమే కాకుండా, వెనుకబడిన ప్రాంతాల్లో ఎక్కువ మంది వ్యక్తులు బీమాను పొందేలా చూస్తోంది. పీబీ పార్ట్‌నర్స్ పీబీ పాఠశాల, జ్ఞానశాల వంటి కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇక్కడ వ్యాపార అధి పతులు మరియు సీనియర్ ప్రొఫెషనల్స్‌తో ఏజెంట్ భాగస్వాములు సంభాషించవచ్చు. ఏవైనా ప్రశ్నలు లేదా సందేహాలను ఇక్కడ తక్షణమే పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఏజెంట్ భాగస్వాములు, వినియోగదారులకు సహాయం చేసేందుకు రిలేషన్‌షిప్ మేనేజర్‌లు వారి బీమా ప్రయాణాన్ని సులభం చేసేందుకు వివిధ ప్రాంతాలలో అందుబాటులో ఉన్నారు. ఏజెంట్లు మరియు వినియోగదారులు ఇద్దరికీ పీబీ పార్ట్‌నర్స్ వినూత్న ఫీచర్లు అనుభవాన్ని మరింత మెరుగుపరుస్తాయి. ఆన్ డిమాండ్ చెల్లింపు ( ఫీచర్ ఏజెంట్ భాగస్వాములు పాలసీ విక్రయం తర్వాత అదే రోజు లేదా మరుసటి రోజులో చెల్లింపులను స్వీకరించడానికి అనుమతిస్తుంది, తక్షణ ఆర్థిక రివార్డ్‌లను అందిస్తోంది. ఈ పెర్క్‌లు పీబీ పార్ట్‌నర్స్ నెట్‌వర్క్ వృద్ధికి దోహదపడుతున్నాయి.

**కస్టమర్ ఎడ్యుకేషన్ మరియు ఎంగేజ్‌మెంట్**

వినియోగదారులకు అవగాహన కల్పించడంలో పీబీ పార్ట్‌నర్స్ నిబద్ధత బీమా ప్రయోజనాలను ప్రోత్సహించడమే కాకుండా మరింత సమాచారాన్ని, ఆర్థికంగా సురక్షితమైన సముదాయాలను పెంపొందిం చడం ద్వారా అసాధారణమైన సేవలను అందించడానికి వారి ఏజెంట్ భాగస్వాములకు సాధికారతను కల్పిస్తుంది. శిక్షణ, సాంకేతికతలో నిరంతరం పెట్టుబడి పెట్టడం ద్వారా, పీబీ పార్ట్‌నర్స్ బీమాను మరింత అందుబాటులోకి, వినియోగదారునికి-స్నేహపూర్వకంగా చేస్తుంది. చివరిగా, వినియోగదారుల మధ్య అధిక ఎంగేజ్‌మెంట్‌ను, నమ్మకాన్ని పెంచుతుంది. వినియోగదారునికి అవగాహన, ఎంగేజ్‌మెంట్‌పై ఈ చురుకైన వైఖరి, బీమాను ప్రజల జీవితంలో అంతర్భాగంగా మార్చడానికి పీబీ పార్ట్‌నర్స్ అంకితభావాన్ని హైలైట్ చేస్తుంది.

**తెలుగు రాష్ట్రాల్లో రానున్న రోజులలో నిర్వహించే కార్యక్రమాలు**

పీబీ పార్ట్‌నర్స్ బీమా అవగాహనను, అందుబాటును పెంపొందిస్తూ, తెలుగు మాట్లాడే ప్రాంతాలకు అనుగుణంగా వినూత్న ఉత్పత్తులను, కార్యక్రమాలను పరిచయం చేయడానికి సిద్ధంగా ఉంది. ఈ ప్రయత్నాలలో ప్రధానమైనది అనుభవ కేంద్రాల ఏర్పాటు.

భారతదేశపు అతిపెద్ద వినియోగదారు మార్కెట్‌కి బీమా కవరేజీని విస్తరించే వ్యూహాలపై దృష్టి సారిస్తూ, పీబీ పార్ట్‌నర్స్ వ్యాపార బృందాలతో జ్ఞానయుక్తమైన సంభాషణలలో పాల్గొనడానికి ఏజెంట్ భాగస్వాములకు అనుభవ కేంద్రాలు సహకార స్థలాన్ని అందిస్తాయి. జ్ఞానం మరియు నైపుణ్యాన్ని పంచుకోవడానికి మాత్రమే కాకుండా, ఈ చొరవ ఏజెంట్ భాగస్వాములు తమ సముదాయాలకు మెరుగైన సేవలు అందించేందుకు సాధికారత ఇస్తుంది.

**భవిష్యత్తు ప్రణాళికలు మరియు పరిశ్రమ ఔట్‌లుక్**

దక్షిణ భారతదేశంలోని బీమా పరిశ్రమ రానున్న 5-10 ఏళ్లలో గణనీయమైన పరిణామానికి లోనయ్యే అవకాశం ఉంది. ఈ చొరవ ఈ విస్తరణలో ముఖ్యంగా తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్‌లో కీలక పోషించేందుకు సిద్ధంగా ఉంది. ప్రధాన లక్ష్యాలలో సుస్థిరత మరియు స్కేలబిలిటీ చుట్టూ పరిభ్రమిస్తూ, విస్తృత స్థాయిలో వినియోగదారులను చేరుకోవాలనే లక్ష్యంతో ఉంటాయి. పెరిగిన డిజిటలైజేషన్ బీమా ప్రక్రియను క్రమబద్ధం చేస్తూ, మరింత యూజర్ ఫ్రెండ్లీగా చేస్తుంది. కంపెనీలు వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా సేవలను అందించేందుకు ఏఐ మరియు బిగ్ డేటా వంటి అధునాతన సాంకేతికతలను ఉపయోగించుకుని కస్టమర్-సెంట్రిక్ విధానాలపై ఎక్కువ దృష్టి పెడతాయి. ఎక్కువ మంది ప్రజలు బీమా ప్రాముఖ్యతను గుర్తిస్తున్నందున, పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఆర్థిక అక్షరాస్యత మరియు అవగాహన పెరగడం కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ఈ చొరవ పీబీ పార్ట్‌నర్స్ అందుబాటులోకి తీసుకువచ్చిన పాయింట్ ఆఫ్ సేల్స్ పర్సన్ వంటి వినూత్న నమూనాలు డిజిటల్ సౌలభ్యం మరియు వ్యక్తిగత పరస్పర చర్యల మధ్య అంతరాన్ని తగ్గించడం కొనసాగిస్తూ, విస్తృత బీమా వ్యాప్తి మరియు ప్రాప్యతను నిర్ధారిస్తాయి. మొత్తంమీద, పరిశ్రమలో సరళీకృత ప్రక్రియలు, సాంకేతిక పురోగమనాలు మరియు వ్యక్తిగతీకరించిన సేవపై ఎక్కువ దృష్టి పెట్టడం ద్వారా వినియోగదారులకు మెరుగైన విశ్వాసం మరియు ఎంగేజ్‌మెంట్ లభిస్తుంది.



**ధృవ్ సారిన్,**
**సహ వ్యవస్థాపకుడు**
**పీబీ పార్ట్‌నర్స్**

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com
SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# పద్యసుధ

## 1. అంకెల రామాయణం

కం||
అంచిత చతుర్ధ జాతుఁడు
పంచమ మార్గమున నేఁగి ప్రథమ తనూజన్
గాంచి తృతీయం బచ్చట
నుంచి ద్వితీయంబు దాఁటి యొప్పుగ వచ్చెన్.

మన కవులు పద్యరచనలో చిత్రవిచిత్రాల్కెన విన్యాసాలు చేశారు. వాటిలో ఇది ఒకటి. నాలుగవ దానికి జన్మించినవాడు ఐదవమార్గం గుండా వెళ్లి, మొదటిదాని కూతురిని చూసి, మూడవదాని నక్కడ ఉంచి, రెండవ దానిని దాటి తిరిగి వచ్చాడు.

పంచభూతాలలో మొదటిది భూమి, రెండవది నీరు, మూడవది అగ్ని, నాల్గవది గాలి, ఐదవది ఆకాశం. ఈ పద్యం వెనుక ఉన్న రహస్య మిదే! వాయునందనుడ్కెన హనుమంతుడు ఆకాశమార్గంగుండా లంకా నగరానికి వెళ్లి భూదేవి కుమార్తెయైన సీతాదేవిని చూసి అగ్నితో లంకా దహనం చేసి సముద్రాన్ని దాటి తిరిగివచ్చాడని దీని వివరణ.

పంచభూతాల పేర్లతో కాకుండా వాటి వరుస సంఖ్యలతో రామాయణంలోని సుందరకాండకు సంబంధించిన వృత్తాంతాన్ని వివరిస్తున్న మంచి చాటుపద్య మిది. చాటుపద్య మంటే ఏ కావ్యం లోనిదీ కాని పద్యం. ఏదో సందర్భంగా కవీశ్వరులు అలవోకగానూ, ఆశువుగానూ చెప్పిన పద్యం. రసవత్తరమ్కెన, ప్రచుర ప్రచారంలో ఉన్న అనేక చాటుపద్యాలకు రచయిత లెవరోకూడా మనకు తెలియరావటం లేదు. అదీ చాటుపద్య మంటే!

## 2. స్థిరసంకల్పం

తే||
అని నివారించె గిరిపత్ని యనుఁగుఁ గూతుఁ
బార్వతియుఁ దల్లిమాటఁ జేపట్టదయ్యె
నీప్సితార్థంబునకుఁ బాఱు హృదయరుచియు
నిమ్నమున కోడిగిలు నీరు నిలుపరాదు.

'...ఆ విధంగా చెప్పి' అంటూ ఈ పద్యం మొదలవుతున్నది. ఆ విధ మేమిటో తరువాత చూద్దాం! ఇప్పుడు ఈ పద్యం:

పరమేశ్వరుడిని గురించి తపస్సు చేసి మెప్పించి అతడిని భర్తగా పొందుదా మనుకొన్నది పార్వతి. తల్లియైన మేనక వద్దకు వెళ్లింది. వెళ్లి ఆ విషయాన్ని చెప్పింది. విన్న మేనక గుండె గుభేలుమన్నది. 'అమ్మా! ఆ తపస్సు నీ వల్ల కాదు. వద్దమ్మా! అన్నది. పార్వతి వినలేదు. తల్లి బుజ్జగిం చింది. అనేక విధాలుగా చెప్పింది. ఐనా వినలేదు పార్వతి. ఎందుకు విన లేదో చెప్తున్నాడు కవి.

ఒక ఎత్త్కెన పర్వత శిఖరాగ్రంనుండి ఒక నీటిప్రవాహం- జలపాతం ధనధనా నేల మీదకు దూకుతున్నది. ఆ ప్రవాహాన్ని మన మాపగలమా? మన వల్ల కాదు. ఒకడి కొక పని చేయాలనే సంకల్పం కలిగింది. అతడి మనస్సు అటువ్కెపే పరిగెత్తుతున్నది. అటువంటి సమయంలో ఆ మాటా ఈ మాటా చెప్పి అతడి మనస్సును మార్చగలమా? లేదు. అందుకే మేనక పార్వతి మనస్సును మార్చలేకపోయింది. పార్వతి తల్లి మాట వినలేదు. ఎందుకని? ఆమెకి తల్లి పట్ల ప్రేమ లేదా? అంటే ఉన్నది. గౌరవం లేదా? అంటే ఉన్నది. కానీ వాటి కన్న శివుడిని భర్తగా పొందుదామనే కోరిక తీవ్రతమంగా ఉన్నది. అదీ కారణం.

ఈ పద్యం సుకవితామహారాజ్య భద్రాసనారూఢుడ్కెన శ్రీనాథుడి (క్రీ.శ.14,15శ.) 'హరవిలాసం' లోనిది (4-7).

## 3. ధన్యాత్ముడు

శా||
అమ్మా! నీ దయ వల్ల మానవులకే అబ్బెన్ గదా! వాక్కు భ
వ్యమ్మౌ కైతల నందు పద్యముల వ్రాయంజాలి రే కొందఱో!
'సమ్మాన్యుం డగుగాత ఈత!' దని వాత్సల్యంబు చూపించి
ప ద్యమ్మున్ వ్రాసెడి శక్తి నిచ్చితివి ధన్యాత్ముండ నో భారతీ!

ఆకాశవాణి విజయవాడ కేంద్రంవారు ప్రతివారమూ 'సరసవినోదిని- సమస్యాపూరణ'మనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఒక కవి ఆ కార్యక్రమానికి పద్యాలను వ్రాస్తున్నాడు. వ్రాస్తూ తనకు ఆ పద్యరచనా శక్తిని ప్రసాదించిన సరస్వతీదేవికి భక్తిపూర్వకంగా కృతజ్ఞతలను తెలియజేస్తున్నాడు. ఏమని?

'అమ్మా! సరస్వతీ! ఈ సృష్టిలో అనేక కోట్ల జీవరాసులున్న్కె. వీటిలో మాట్లాడే శక్తి నీ దయ వలన ఒక్క మానవులకు మాత్రమే అబ్బింది. వీరిలో కమ్మని కవితలను వ్రాయగలిగినవారు కొద్దిమందే ఉన్నారు. ఆ కొద్దిమందిలోనూ పద్యాన్ని మరీ కమ్మగా నడపగలిగినవారు చాల తక్కువమంది. 'వీడు నలుగురిలోనూ మంచిపేరును తెచ్చుకోవాలి. సత్కీర్తిని సంపాదించు కోవా'లని నా పట్ల గల వాత్సల్యంతో పద్యాన్ని వ్రాసే శక్తిని నా కనుగ్రహించావు. వ్రాస్తున్నాను. నలుగురూ మెచ్చుకొంటున్నారు. అంతా నీ దయ! ధన్యాత్ముడి న్కెనాను'.

మనుష్యులలో ఏ కొద్దిమందికో అబ్బిన కవనశక్తి నా కబ్బినందు కానందిస్తూ ఆ శక్తిని నాకు ప్రసాదించిన చదువులతల్లి సరస్వతీదేవిని స్తుతిస్తున్న కవిని పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి అనే నేనే! ఈ పద్యం నా 'సమస్యాతోరణం' అనే పద్యసంకలన గ్రంథం లోనిది (పుట76).



## 4. ప్రాణమిత్రుడు

ఉ||
ఆడిన నొక్క మాట నడయాడఁ గడంగిన నొక్కబాట మా
టాడిన నొక్క మాట నిశలందుఁ బరుండిన నొక్క చోట నీ
జాడ నొడళ్లు వేఱయిన సంతత మాత్మలు వేఱుగాక మా
తోడి వయస్యు లీర్ష్యఁ గొనఁ దోచితి మిర్వుర మొక్క
రూపునన్.

తల్లి, తండ్రి-ఈ ఇద్దరి తరువాత మనకు ప్రధానమ్కెన వ్యక్తి స్నేహితు డన్నారు పెద్దలు. భవానీశంకరుడనే ఆయన తన ప్రాణమిత్రుడ్కెన బిల్వమంగళుడిని గురించి చింతామణికి చెప్తున్నాడు.

'చిన్నతనంలో మే మిద్దరమూ ఒకే బడిలో చదువుకొన్నాం. ఆటలకు వెళ్లినట్లయితే ఒకే ఆట ఆడేవాళ్లం. ఒకే మార్గంలో నడిచేవాళ్లం. ఏ విషయంలోన్కెనా అభిప్రాయభేద మనేది మా మధ్యన ఉండేది కాదు. ఒకే మాట. రాత్రి పూట ఒకే చోట పడుకొనేవాళ్లం. మా ఇద్దరి శరీరాల్కెతే వేర్వేరుగా ఉన్నాయి కానీ చింతామణీ! ఆత్మ లొక్కటే! మా ఇద్దరి అన్యోన్యతను చూచి తోటి స్నేహితు లందఱు చాల ఈర్ష్యపడేవారు. మా మ్కెత్రి అటువంటిది'.

ఒకచోట చక్కగా నివసించే పిల్లలు, ఒకచోట చదువుకొనే పిల్లలు పరస్పరం కలహించుకో గూడదు. మ్కెత్రీభావంతో మెలగాలి. 'వాడే వీడు, వీడే వా' డన్నంత సన్నిహితంగా ఉండాలని చెప్తున్న ఈ పద్యం వరశుల్క దుర్ణయదూరీకరణకై ఎనలేని కృషిసల్పిన మహాకవి కాళ్లకూరి నారాయణ రావుగారు (1871-1927) రచించిన 'చింతామణి' నాటకంలోని తృతీ యాంకం లోనిది.

## 5. మనస్సు

ఆ||
ఇనుము విఱిగెనేని యినుమాఱు ముమ్మాఱు
కాచి యతుకవచ్చుఁ గ్రమముగాను
మనసు విఱిగెనేని మఱి యంట నేర్చునా?
విశ్వదాభిరామ! వినుర వేమ!

ఒకడు మానవత్వం కలిగి మానవుడు లాగా ప్రవర్తించినా, ఆ స్థాయికి మించి మానవోత్తముడుగా, మాధవుడుగా ప్రవర్తించినా, లేదూ మానవత్వాన్ని కోల్పోయి దానవుడుగా ప్రవర్తించినా దానికి కారణం మనస్సే! ఈ మనస్సు అనేది అంత విలువ్కెనదీ, ముఖ్యమ్కెనదీనూ.

ఏద్కెనా ఇనుప వస్తువుకి చిల్లిపడినట్లయితే మాటువేయవచ్చును. విరిగిపోతే అతకవచ్చును. ఒకసారి కాదు. రెండు, మూడు సార్లు విరిగినా అతకవచ్చును. వస్తువు మరీ పనికిరాకుండా పోయిం దనుకోండి. కొలిమిలో మరగబెట్టి క్రొత్తవస్తువుగా పోతపోయవచ్చును. ఇబ్బం దేమీ లేదు. మనస్సు అట్లా కాదు. చాలా సున్నితమ్కెనది. పెళు సుదన మెక్కువ దానికి. ములికి లాంటి మాట ఒక్కటి తగిలితే చాలు. బాధతో మూలుగుతుంది. విలవిల లాడిపోతుంది. తా నభిమానించినవాళ్లు అపార్థం చేసుకొంటే విరిగిపోతుంది. తిరిగి అతుక్కోదు. వెయ్యి క్షమాపణలు చెప్పు. లక్ష చెప్పు. అతుక్కోదు కాక అతుక్కోదు. దాని లక్షణ మది. అదంతే!

అందువల్లనే ఎవరి మనస్సుకైనా ఇబ్బంది కలిగేవిధంగా మాట్లాడ గూడదు. తొందరపడి ఎవరినీ అపార్థం చేసుకోగూడదు. కాలు జారితే తీసుకోగలంబీ కానీ నోరు జారితే తీసుకోలేమనే నీతిని బోధిస్తున్న ఈ పద్యం ప్రజాకవి వేమన (క్రీ.శ.18 శ.) రచన.

## 6. కీర్తిహంసి

ఉ||
ఈ రేడు జగములన చె
న్నారెడు పదునాల్గు గ్రుడ్ల ననిశము ఱెక్కల్
సారించి పొదుగుచున్నది
కోరిక నీ కీర్తిహంసి కోమటివేమా!

కవులు మహా చమత్కారులు. వాళ్లు ఏ విషయాన్నైనా జనరంజకంగా చెప్పి భళీ! అనిపించుకొంటారు. కొండవీటి సామ్రాజ్యాన్ని పరిపాలి స్తున్న పెదకోమటి వేమారెడ్డి (క్రీ.శ.1402-1420) ఆస్థానాని కొక కవి వచ్చాడు. 'రాజా! నీ కీర్తి చాలా గొప్ప' దన్నాడు. ఈ మాట నెవరైనా అన వచ్చును. కానీ ఇప్పు డంటున్నవాడు కవి కదా! అందుకే చమత్కార భరితంగా చెప్పాడు. చూడండి!

భూలోకం, భువర్లోకం, సువర్లోకం, మహాలోకం, జనలోకం, తపోలోకం, సత్యలోకం- ఈ ఏడూ ఊర్ధ్వలోకాలు. అతల, వితల, సుతల, రసాతల, మహాతల, తలాతల, పాతాళలోకాలు ఏడూ అధోలోకాలు. ఈ పద్నాలుగు లోకాలు పక్షిగ్రుడ్ల లాంటివి. వేమారెడ్డి కీర్తి ఆడుహంస లాంటిది. 'రాజా! హంస తన రెక్కల క్రింద గ్రుడ్లను పెట్టుకొని పొదిగినట్లుగానే నీ కీర్తి అనే హంసి కూడా తన రెక్కలను చాచి ఈ పద్నాలుగు లోకాలను వాటి క్రిందికి తెచ్చుకొని నిరంతరమూ పొదుగుతున్న' దన్నాడు కవి. అంటే వేమారెడ్డి కీర్తి హంసి లాగా తెల్లగానూ, స్వచ్ఛంగానూ శోభాయమానంగానూ ప్రకాశిస్తున్నదనీ, అది పద్నాలుగు లోకాలనూ దాటి పైకి వెళ్లి విశ్వవ్యాప్తమ్కె తేజరిల్లుతున్నదనీ భావం.

స్వయంగా కవి, కవిపోషకుడూ ఐన పెదకోమటి వేమారెడ్డి కీర్తి యొక్క ఔన్నత్యాన్ని అత్యద్భుతంగా వర్ణిస్తున్న ఈ పద్యాన్ని చెప్పిన ఆ సుకవి ఎవరో మనకు తెలియరావటం లేదు. కానీ సాహిత్య ప్రపంచంలో మాత్రం ప్రచుర ప్రచార మున్న చాటుపద్య మిది.

## 7. సమస్యాపూరణం

ఆ||
'ఎన్ని దినములాయె? నిట నన్ను డించి నీ
వరిగి!' యనిన పత్ని కనియె భర్త
'నేఁటి కెన్నఁగఁ బది నెలలాయెగా నేఁడు
గణచతుర్థిబీ నాఁడు ఫణిచతుర్థి'.

సాధారణంగా పద్యంలో నాలుగు పాదాలుంట్కె కదా! మనం కవికి నాలుగవ పాదాన్ని ఇస్తాం. అది అసంబద్ధంగానూ, వింతగానూ, విడ్డూరంగానూ ఉంటుంది. కవి మొదటి మూడు పాదాలు చెప్తాడు. దానితో ఆ నాలుగవ పాదం సంబద్ధ మవుతుంది. దీనిని 'సమస్యాపూ- రణ' మంటారు. ఒకసారి మన జంటకవులు కిర్లంపూడి సంస్థానంలో ఇనుగంటి చిన్నారావుగారి సమక్షంలో అష్టావధానం చేస్తున్నారు. అప్పుడొక పృచ్ఛకుడు 'గణచతుర్థి నాఁడు ఫణిచతుర్థి- వినాయకచవితి రోజున నాగులచవితి అని సమస్య నిచ్చాడు. ఇది విడ్డూరంగానే ఉన్నదికదా! సమస్య అంటే ఇదే మరి. మన కవులు దీని నవలీలగా పూరించారు. ఏ విధంగానంటే-

ఒక భార్య తన భర్త నడిగింది- 'మీరు న న్నిక్కడ దింపి వెళ్లి ఎన్ని రోజుల్కెంది?' అని. ఆయన బాగా ఆలోచించి లెక్కలు వేసి 'ఈ రోజు వినాయకచవితి. ఆ రోజు నాగులచవితి. కనుక పదినెలల్కెంది' అన్నాడు. కార్తికమాసంలో నాగులచవితి, భాద్రపదమాసంలో వినాయక చవితి వస్తాయి. కార్తికం నుండి భాద్రపదానికి పది నెలలు. అదీ లెక్క. 'వినా యక చవితి రోజున నాగులచవితి' అనే అర్థం స్పష్టంగా ఆ సమస్యలో కనిపిస్తుంటే ఆ పాదానికి ముందు 'నేడు' అనే పదాన్ని కలిపి 'నేడు వినా యక చవితి, ఆ రోజు నాగులచవితి' అనే అర్థాంతరాన్ని-మరొక అర్థాన్ని సాధించటమే ఈ పూరణలోని విశేషం! ఈ సమస్య నిట్లా రసవత్తరంగా పూరించినవారు తిరుపతి వేంకటకవులు. (దివాకర్ల తిరుపతి శాస్త్రి (1872 -1920), చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి (1870-1950).

**(మిగతా వచ్చేవారం)**

'మధురవక్త'
డా|| పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.
(గోల్డ్ మెడలిస్ట్)తెలుగు లెక్చరర్ -
రిటైర్డ్ - 89785 25456





# కాసులు కురిపించే కాశ్మీరీ కుంకుమపువ్వు

భారతదేశంలో పండే కుంకుమపువ్వుకు ఎన్నో శతాబ్దాల చరిత్ర ఉంది. మానవునికి ఆయురారోగ్యాలు కలుగచేయుటలో, సుగంధ సుమధుర వాసనలు వెదజల్లుటలో, వైద్య పరంగా, ఆహార పరంగా, వస్త్రాల రంగుల్లో, ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికి ఇలా అనేక రకాలుగా భారతీయ నాగరికతకు, సంస్కృతిలో మమేకమైనది. పురాతన కాలం నుండి నేటి ఆధునిక కాలం వరకూ భారతీయుల మనసును దోస్తూనే ఉంది. దీని చరిత్రను పరిశీలిస్తే, భారతదేశంలోకి మొదటిసారిగా పర్షియా ( ప్రస్తుతం ఇరాన్) నుంచి వచ్చినట్లు తెలుస్తోంది. " బైజాంటియన్ " చక్రవర్తులు కాలంలో కుంకుమపువ్వు" కరెన్సీ" లా వాడేవారు అని చరిత్ర ఆధారాలు చెబుతున్నాయి. బంగారం కంటే కుంకుమపువ్వుకు గిరాకీ, విలువ ఎక్కువ అంటే ఆశ్చర్యం కలుగుతుంది. మందుల తయారీలో, మతపరమైన కార్యక్రమాల్లో కుంకుమపువ్వు వాడినట్లు వేదాలు ద్వారా తెలుస్తోంది.



(ఐ.ప్రసాదరావు 6305682733)

క్రీ.శ 5వ శతాబ్దంలో ప్రముఖ బౌద్ధ సన్యాసి " మధ్యానిథికా" కాశ్మీర్ సందర్శించిన సందర్భంగా కాశ్మీర్ లో కుంకుమపువ్వు పంట పండించడానికి సన్నాహాలు చేసినట్లు తెలుస్తోంది. ఈ సమయం నుంచే కుంకుమపువ్వు పంట దేశవ్యాప్తంగా చాలా చోట్ల పండించడం మొదలు పెట్టారు. ఆహారంలో, వస్త్రాలకు రంగులు అద్దటానికి కుంకుమపువ్వు విరివిగా వాడటం ప్రారంభించారు. చైనాలో కూడా మంగోలులు ద్వారా పర్షియా దేశం నుంచి ఈ కుంకుమపువ్వు పంట చేరినట్లు తెలుస్తోంది. అప్పటికే కాశ్మీర్ ప్రాంతాల్లో కుంకుమపువ్వు పంట పండుచున్నట్లు, గౌతమ బుద్ధుడు ప్రతిమలకు హారతి రూపంలో కుంకుమపువ్వు సమర్పిస్తునట్లు చైనా వైద్యుడు "వాన్ జెన్" తెలిపారు.

పర్షియా నుంచి వచ్చిన కుంకుమపువ్వు మరియు వివిధ సుగంధ ద్రవ్యాలు ఆ రోజుల్లోనే పెద్ద మార్కెట్ గా విస్తరించింది. అయితే, 11 , 12 శతాబ్దాల నుంచి భారతదేశంలోని కాశ్మీర్ ప్రాంతాల్లో కుంకుమపువ్వు పంట విస్తారంగా పండించడం ప్రారంభించారు. ఇద్దరు సూఫీ సన్యాసులు ఖ్వాజా మసూద్ వాలీ, హజ్రత్ షేక్ షరీపుద్దీన్ కుంకుమపువ్వు విత్తనాలు ఇచ్చుట ద్వారా కాశ్మీర్ లో పంట విరివిగా పండించడం మొదలు పెట్టారు. దీంతో కుంకుమపువ్వు వ్యాపారం ప్రపంచ నలుమూలల వ్యాపించింది.

(మిగతా 8వ పేజీలో)

( 7వ పేజీ తరువాయి)

ముఖ్యంగా పర్షియా - భారత్ మధ్య కుంకుమపువ్వు వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లింది. అంతేకాకుండా, మధ్య ఆసియా దేశాలు అయిన ఉజికెకిస్తాన్, తజికిస్తాన్, క్రిగిస్తాన్ దేశాలతో కూడా కుంకుమపువ్వు వ్యాపారం అభివృద్ధి చెందింది. ఈ దేశాల్లో కూడా కుంకుమపువ్వు పంట పండించడం వలన భారత్ - మధ్య ఆసియా దేశాలు మధ్య వ్యాపారం బాగా జరిగింది. మరియు అరబిక్ దేశాలైన సౌదీ అరేబియా, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కూడా కుంకుమపువ్వు వ్యాపారం విరివిగా జరిగింది. బాగా ఖరీదైన మన కాశ్మీరు కుంకుమపువ్వు యూరోపియన్ దేశాల్లో కూడా మంచి గిరాకీ ఉండేది. దీంతో సిల్క్ రహదారి గుండానే కాకుండా, ఇతర రహదారుల ద్వారా కూడా కుంకుమపువ్వు వ్యాపారం జరుగుతూ ఉండేదని తెలుస్తోంది. చైనాలో కుంకుమపువ్వు పంట సేద్యం చేయటం తెలియకపోవడం వల్ల భారత్ కుంకుమపువ్వు వ్యాపారం అభివృద్ధి చెందడం ద్వారా ఇరుదేశాల మధ్య ఆర్థిక సాంస్కృతిక బలమైన సంబంధాలు కలిగి ఉండేవి. ప్రస్తుతం కూడా మనదేశం మధ్య ఆసియా, యూరప్, ఉత్తర అమెరికా దేశాలతో కుంకుమపువ్వు వ్యాపారం విరివిగా కొనసాగిస్తున్నారు. మన కాశ్మీరు కుంకుమపువ్వు అంటే విదేశాల్లో మంచి గిరాకీ ఉంది.



వివిధ పండుగల సందర్భాల్లో, దైవ ఆధ్యాత్మిక కార్యక్రమాలలో, ఆహారంలో, శుభసూచకంగా కుంకుమపువ్వు వాడతూ ఉండుట వలన మంచి వ్యాపారంగా కొనసాగుతోంది. ఆయుర్వేద వైద్యంలో సకల రోగాలను నయం చేసే చింతామణిలా కుంకుమపువ్వు పేరుగాంచింది. ముఖ్యంగా ఊపిరితిత్తుల వ్యాధుల నివారణకు, అజీర్తి మలబద్ధకం వంటి అనారోగ్యాల నివారించడానికి ఉపయోగపడుతుంది. అద్భుతమైన కాశ్మీర్ లోయల్లో పండే కుంకుమపువ్వుకు అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. మంచి సువాసన కలిగి ఉంటుంది. అందుచేతనే వివిధ తయారీలో వాడుతున్నారు. ఇటీవల ప్రపంచంలో కూడా చాలా ప్రాంతాల్లో కుంకుమపువ్వు పండించడం ప్రారంభించుటచే మన కుంకుమపువ్వు వ్యాపారం కూడా కొన్ని ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నది. రైతులు కూడా కొన్ని సమస్యలు ప్రారంభమవుతున్నాయి. దీనికి తోడు నకిలీ బాధలు వెంటాడుతున్నాయి. వాతావరణ మార్పులు కూడా ఇబ్బంది పెడుతున్నాయి.

అందుచేతనే శీతల ప్రాంతాల్లోనే కాకుండా, ఉష్ణ ప్రాంతాల్లో కూడా కుంకుమపువ్వు పండించడానికి రాజస్థాన్ వ్యవసాయ శాఖ కొత్త రకం కుంకుమపువ్వు పండించడానికి చర్యలు తీసుకుంది. కాశ్మీర్ నుంచి జైసల్మీర్ వరకు కుంకుమపువ్వు పంట పండించడానికి కృషి ప్రారంభించారు. జాలోర్, జైసల్మీర్, దాల్సర్, చురు, పిలాని ప్రాంతాల్లో కుంకుమపువ్వు పంట పండించడం మొదలు పెట్టారు . దేశవ్యాప్తంగా ఇతర ఉష్ణ ప్రాంతాల్లో కూడా కుంకుమపువ్వు పండించడానికి చర్యలు తీసుకుంటున్నారు. జమ్మూ కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ ప్రాంతాల్లో పండే కుంకుమపువ్వు "రెడ్ గోల్డ్" గా ప్రసిద్ధి చెందింది. దీని ధర కిలో 3,600 అమెరికన్ డాలర్లు అని తెలుస్తోంది. చంటి పిల్లలకు, పెద్దలకు అవసరమైన ఆయుర్వేద మందులు తయారీలో కుంకుమపువ్వు వాడుట జరుగుతుంది. హిందువుల మత పరమైన కార్యక్రమాల్లో, బౌద్ధ మత కార్యక్రమాల్లో కుంకుమపువ్వు వాడుట జరుగుతుంది. బిర్యానీ, కీర్ వంటి ఆహార పదార్థాల్లో కూడా విరివిగా వాడటం జరుగుతుంది. ఒక విధంగా చెప్పాలంటే ఈనాటికీ కుంకుమపువ్వు వాడకం సామాన్యులకు అందుబాటులో లేదు. ధనికులకు మాత్రమే అందుబాటులో ఉందనేది వాస్తవం. ప్రభుత్వాలు కుంకుమపువ్వు పంట పండించడానికి కావలసిన వసతులు కల్పించాలి. నీటి సరఫరా చేయాలి. రైతులను ప్రోత్సాహించాలి. అనేక విధాలుగా ఆహార పదార్థాల్లో, మందుల తయారీలో, సుగంధ ద్రవ్యంగా, వివిధ సువాసన వెదజల్లే పెర్ఫ్యూమ్స్ తయారీలో మతపరమైన కార్యక్రమాల్లో విరివిగా వాడుతున్న మన కుంకుమపువ్వు పంటను భారిగా పండించడానికి చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో అందరికీ అందుబాటు ధరల్లో లభ్యమవుతుంది అని ఆశిద్దాం...

## ఔషధగుణాలు



కుంకుమపువ్వులో అనేక రకాల ఔషధగుణాలున్నాయి. అంతేకాకుండా కుంకుమపువ్వు చాలా ఖరీదైనది కూడా.. అందుకే చాలామంది కొనుగోలు చేయడానికి వెనకడుగు వేస్తుంటారు. అయితే, కుంకుమపువ్వు మన ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా పరిగణించే ప్రకృతి సంపద. ఇరాన్‌లో కుంకుమపువ్వు ఎక్కువగా పండిస్తారు. దీని తర్వాత ఆఫ్ఘనిస్తాన్.. కాశ్మీర్ తదితర ప్రాంతాలలో పుష్కలంగా లభిస్తుంది. కుంకుమపువ్వు వేడి ప్రభావాన్ని కలిగి ఉంటుంది. దీనిని తరచుగా పాలతో కలిపి తీసుకుంటారు. మీరు దీన్ని తీసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు.. అవేంటో తెలుసుకోండి..

**కళ్లకు మేలు చేస్తుంది:** కుంకుమపువ్వులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి రెటీనాను రక్షించడంలో, కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఇవి మాక్యులర్ డీజెనరేషన్, క్యాటరాక్ట్ వంటి కంటి సమస్యలను నివారిస్తాయి.

**జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది:** కుంకుమపువ్వు సహాయంతో మీ జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. తరచుగా చాలా విషయాలు మరచిపోయే వ్యక్తులు దీనిని తీసుకోవడం మంచిది.. పెరుగుతున్న వయస్సుతో చాలా మంది అల్జీమర్స్ వ్యాధితో ఇబ్బందులు పడుతున్నారు. దీనిని నివారించడానికి, కుంకుమపువ్వును తీసుకోవడం మంచిది.

**రోగనిరోధక శక్తి పెరుగుతుంది:** విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు వంటి రోగనిరోధక శక్తిని పెంచే అనేక సమ్మేళనాలను కుంకుమపువ్వు కలిగి ఉంటుంది. ఇవి జలుబు, దగ్గు, ఫ్లూ, జ్వరం వంటి సాధారణ వైరల్ వ్యాధుల నుండి రక్షించడంలో సహాయపడతాయి.

**డయాబెటిస్‌లో ప్రభావవంతంగా** కుంకుమపువ్వు డయాబెటిక్ రోగులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని తగ్గిస్తుంది. ఇంకా ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతుందని ప్రపంచవ్యాప్తంగా అనేక పరిశోధనల్లో రుజువైంది

**డిప్రెషన్ దూరమవుతుంది:** కుంకుమ పువ్వు సెరోటోనిన్ వంటి న్యూరోట్రాన్స్‌మిటర్లను నియంత్రించడంలో సహాయపడే సమ్మేళనాలను కలిగి ఉంటుంది. ఇది మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది.. అంతేకాకుండా డిప్రెషన్ నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

## ఆరోగ్య ప్రయోజనాలు

కుంకుమపువ్వు ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఎక్కువ. కొన్నిసార్లు కోపం రావడం, కొన్నిసార్లు ఏడవడం-ఇలాంటి తరచుగా మానసిక కల్లోలం అస్సలు మంచిది కాదు. ఈ పరిస్థితిలో కుంకుమపువ్వు సహాయం తీసుకోండి. కుంకుమపువ్వు మనస్సును ఆరోగ్యంగా ఉంచుతుందని, డిప్రెషన్ లక్షణాలను తగ్గిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఆందోళనను తగ్గించడంలో ఇది ఎంతగానో సహాయపడుతుంది.

కుంకుమపువ్వులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి హానికరమైన ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. కుంకుమపువ్వు తినడం వల్ల గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి అనేక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి మీ ఆహారంలో కుంకుమపువ్వును ఉంచండి.

ముఖ్యంగా కుంకుమపువ్వు మహిళల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్రీ-మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్ అంటే కుంకుమపువ్వు రుతుక్రమం రాకముందే మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కాపాడుతుంది. కాలు నొప్పి, మూడ్ స్వింగ్స్ వంటి లక్షణాలను నియంత్రిస్తుంది.ఈ కుంకుమపువ్వు శృంగార జీవితానికి జోడిస్తే ఎంతో మేలంటున్నారు నిపుణులు.. కుంకుమపువ్వు పురుషులు మరియు స్త్రీలలో లైంగిక కోరికలను పెంచడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా, కుంకుమపువ్వు పురుషులలో అంగస్తంభన పనితీరును మెరుగుపరుస్తుంది.

రోజూ కుంకుమపువ్వు టీ లేదా పాలు తాగడం ద్వారా బరువు తగ్గవచ్చు. కుంకుమపువ్వు ఆకలిని అణిచివేస్తుంది. బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా, కుంకుమ పువ్వులో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఊబకాయాన్ని నివారిస్తాయి. జీవక్రియ రుగ్మతలను తొలగిస్తాయి.కుంకుమపువ్వు గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. కుంకుమపువ్వులోని యాంటీఆక్సిడెంట్ కంటెంట్ కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. గుండె సమస్యలను నివారించడానికి ఆహారంలో కుంకుమపువ్వును తీసుకోండి.

రోజువారీ ఆహారంలో కొద్దిగా కుంకుమపువ్వు వేసుకుంటే మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా మంచిది. కుంకుమపువ్వు కేవలం 8 వారాలలో రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తగ్గిస్తుంది. కుంకుమపువ్వు టైప్-2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

# నమ్మలేని నిజాల 'ఆరంభం' ఓటీటీ సినిమా రివ్యూ

హత్య కేసులో ఓ గ్రామానికి చెందిన మిగిల్ జైలు జీవితం అనుభవిస్తుంటాడు. రెండున్నర సంవత్సరాలుగా కాలఘాటి కారాగారంలో ఉన్నాడు. ఒక రోజు తన వద్ద ఉన్న డైరీని తోటి ఖైదీ పై నుంచి కిందకు విసిరేస్తాడు. ఎప్పుడూ ఎవ్వరి గురించి పట్టిం చుకోని మిగిల్ డైరీ విసిరేసిన ఖైదీని చితక్కొడతాడు. పోలీసులు అడ్డుకుని వారిద్దరినీ పక్కకు తీస్తారు. ఇప్పుడేంది ఇల్లు ఖాళీ చేయాలి కదా.. అంతే కదా.. రేపే చేస్తా అంటూ అక్కడి నుంచి జైలు గదికి వెళతారు. మరుసటి రోజు ఉరిశిక్ష అనగా అక్కడ నుంచి అదృశ్యమవుతాడు. సెల్‌కు వేసిన తాళం వేసినట్టే ఉంటుంది. ఊచలు వంచలేదు, గోడలు బద్దలు కొట్టలేదు. ఎలా తప్పించుకున్నాడో జైలు అధికారులకు అర్థం కాలేదు. అంతా తలలు పట్టుకున్నారు. ఎలాగైనా విషయం బయటకు రాకుండా దర్యాప్తు జరిపించేందుకు డిటెక్టివ్ చేతన్ ద్వారా ఇన్వెస్టిగేషన్ చేయించారు పోలీసులు. అలా రంగంలోకి దిగిన చేతన్, అతని అసిస్టెంట్ కు మిగిల్ రాసిన డైరీ అందుతుంది. మిగిల్ తన డైరీలో జైల్లో తన మొదటి స్నేహితుడు గణేష్ అని వివరిస్తాడు. అందుకే గణేష్ ను డిటెక్టివ్ పిలిపించి విచారించడం మొదలు పెడతారు. వారి ఇన్వెస్టిగేషన్ కథా కమామిషే సినిమా కథ. డైరీ చదువుతూ సినిమా చూపిస్తారు. హంతకులు ఎవరు? ఎందుకు హీరో జైలుకు రావాల్సి వచ్చిందనే అశాలపై సినిమా ముగింపులో తెలుస్తాయి. క్రమంలో డెజావు ప్రయోగం గురించి తెలుసుకుని ఆశ్చర్యపోతారు. అసలు డెజావు ప్రయోగం ఏమిటి? ప్రాణాలకు ముప్పు ఉన్న ఆ ఎక్స్‌పెరిమెంట్‌కు నాంది పలికిన ప్రొఫెసర్ సుబ్రహ్మణ్య రావుతో మిగిల్‌కు ఉన్న సంబంధమేంటి? హీరో జీవితంలో తన తల్లి లీలమ్మ, హీరోఇన్ శారద పాత్రలేంటి? చేతన్ ఇన్వెస్టిగేషన్ ఎంత వరకు పూర్తయింది. ఇన్వెస్టిగేషన్ లో ఎటువంటి ముగింపు ఇచ్చాడు? తదితర ప్రశ్నలకు సమాధానం తెలియాలంటే సినిమా పూర్తిగా చూడాల్సిందే.

డెజావు నేపథ్యం టైమ్ లూప్ కాన్సెప్టు తరహాలోనిది. సవాలుతో కూడుకున్న ఇలాంటి చిత్రాలు చాలా తక్కువ సంఖ్యలో రూపొందుతుంటాయి. ఎందుకంటే ఈ కథలు కొందరికి నచ్చుతాయి. మరికొందరికి అర్థం కావు. నచ్చడం వేరు, అర్థం కాకపోవడం వేరు. సినిమా మధ్యలో గతంలోకి వెళ్లి జరిగినదంతా ఒకసారి హీరో చూస్తాడు. జరగబోయేది తెలుసుకుంటాడు. కన్న తల్లి త్వరలో చనిపోతుందని తెలుసుకున్న హీరో ఆమె కోర్కె మేరకు పట్నానికి తీసుకెళ్లి సినిమా చూపించి చిన్నప్పుడు తాగిన షోడా తాపించి ఇంటికి తీసుకొస్తాడు. తల్లి కొడుకు బాంధవ్యం, గతాన్ని, జరగబోయే దాని గురించి తెలిసినప్పుడు బంధాలు, బంధుత్వాలకు హీరో ఇచ్చే విలువ



కళ్లకు కట్టినట్లు చూపిస్తారు. తల్లి కొడుకుపై చూపే ఆప్యాయత, అనురాగం పల్లెల్లో ఎలా ఉంటాయో మనసు లోతుల్లో నుంచి దర్శకుడు బయటకు తీసి చూపిస్తాడు. కన్నడ నవల 'నీను నిన్నోళగి ఖైదీ' ఆధారంగా దర్శకుడు అజయ్ నాగ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. చిత్రమంతా మంచి వాతావరణంలో సాగింది. జైలు కానీ, ఔట్ డోర్ షూటింగ్ స్పాట్స్, పచ్చని చెట్లు, గడ్డి, చల్లని వాతావరణంలో ఊరి అందాలు చాలా బాగా చూపించారు. పూర్తిగా గ్రామీణ వాతావరణం ఎలా ఉంటుందో అన్నీ ఈ సినిమాలో ఉన్నాయి. పాటలు కానీ, డైలాగులు కానీ, మాటలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటాయి. డిటెక్టివ్, ఆయన శిష్యుడి పాత్రలు ప్రేక్షకులను అంతగా ఆకట్టుకోలేదు. వారి ముఖ వర్చస్సు కూడా పేలవంగా కనిపించింది. డిటెక్టివ్ ల ముఖంలో నెక్స్ట్ ఏమి జరుగుతుందోననే ఆత్రుత కనిపించక పోవడంతో వారి పాత్రలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకోలేక పోయాయి. మిగిల్ బాల్యం, అతడి అమాయకత్వం, ఊరి నేపథ్యం, ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యరావుకు హీరో పరిచయమయ్యే సన్నివేశం ఆకట్టుకుంటాయి. సుబ్రమణ్యరావు తన ప్రయోగం కోసం చూస్తున్న వ్యక్తి కళ్లముందు కనిపించే సరికి ఆయన ముఖంలో ఆనందానికి అవధులు ఉండవు. ప్రయోగం పూర్తి చేసే క్రమంలో భార్యా పిల్లలకు దూరమై ఒక పల్లెటూరును ఎంపిక చేసుకుని అద్దెకు ఇల్లు తీసుకుని ప్రయోగశాల అక్కడే ఏర్పాటు చేస్తాడు. ఆ ఇంట్లో ఉన్న టీవీ యాంటెనా లాక్కెళుతూ హీరో సైంటిస్ట్ సుబ్రమణ్య రావుకు కనిపిస్తాడు. అప్పటి నుంచి తన ప్రయోగాన్నిమిగిల్ ద్వారా నెరవేరుస్తాడు. పేరుకి సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ అయినా ఎమోషన్స్‌కు పెద్దపీట వేశారు. తల్లీ కొడుకుల సెంటిమెంట్ ప్రేక్షకుడి హృదయాన్ని హత్తుకుంటుంది. మధ్య మధ్యలో చిన్న చరణాలతో మనిషి గిట్టక మానదు అనే అంశంపై పాటలు ఆకట్టుకున్నాయి. మనిషిని చేరక... మరణం ఆగదు.. అంటూ సాగిన గీతం తల్లి చనిపోతుందని తెలిసిన తరువాత తల్లి చావకూడదని, అయినా ఆపలేమని చెప్పే ఆవేదన ఎంతో ఆకట్టుకుంది.

అసలు కథలోకి వెళ్లడానికి దర్శకుడు చాలా సమయం తీసుకున్నారు. సైన్సు, లాజిక్స్ వగైరా గురించి లోతుగా చర్చించకుండా సింపుల్‌గా డెజావు కాన్సెప్ట్‌ని పరిచయం చేశారు. కానీ ప్రొఫెసర్ లక్ష్మేటన్నది వివరించ కుండానే కన్నుమూస్తాడు. టైమ్ ట్రావెల్ మూవీస్ చూసిన వారికి ఇది కొత్తగా అనిపించకపోవచ్చుగానీ చూడనివారికి కొత్త అనుభూతి ఇస్తుంది. గతాన్ని చెబుతూనే.. మిగిల్ గురించి తనకు తెలిసింది డిటెక్టివ్‌లకు గణేశ్ వివరించే ఎపిసోడ్‌ని కనెక్ట్ చేసిన విధానం మెప్పిస్తుంది. అక్కడ ఎదురయ్యే ట్విస్ట్‌లు సినిమాపై మరింత ఆసక్తి రేకెత్తిస్తాయి. అయితే, కథలో ముందుకెళ్లేకొద్దీ ఆ టెంపో కొనసాగించలేకపోయారు. అనవసర సన్నివేశాలతో సాగదీశారు. ఏదో ఉన్నాయంటే ఉన్నాయి అనేలా హీరోయిన్, విలన్ పాత్రలను క్రియేట్ చేశారు. క్లైమాక్స్ కర్తికట్టించింది. పలుపురితో బాగుందనిపించింది. సైంటిస్ట్ సుబ్రమణ్యరావు కుమార్తె హీరోఇన్ శారద కావడం విశేషం. బిడ్డలు చిన్నగా ఉన్నప్పుడే ఇంటిని వదిలి వచ్చేసిన సుబ్రమణ్యరావు కుమార్తె పెద్దయ్యాక తండ్రి చేస్తున్న ప్రయోగాన్ని తెలుసుకునేందుకు వచ్చి ఉంటుంది.సమయం అనేది ప్రవహిస్తున్న నది లాంటిది. ఆ నదిపై ఒక వైపు కాలువ తవ్వి గుండ్రంగా తిప్పి తీసుకొచ్చి కాలువ తవ్విన చోటే కలిపితే నదిలో పూర్తిగా ముందుకు సాగకుండా గుండ్రంగా తిరుగుతూ ఎలా గడుపుతామో చెప్పేదే ఈ సినిమా. దీనినే డెజావు కాన్సెప్ట్ అంటారు. ప్రకృతి అందాలకు కొదవలేదు. సరదాగా హీరో, హీరోఇన్ గడిపే ప్రాంతంలో మంచు, మిరుగుడు పూలు వాలుతున్నదృశ్యాలు ఆకట్టుకున్నాయి. సినిమా మొత్తం ఏడు అధ్యాయాలుగా విభజించారు. ఫ్యామిలీతో చూడదగ్గ చిత్రం. మదర్ అండ్ సన్ సెంటిమెంట్ కూడా ఉంది. అసభ్య సన్నివేశాలు, సంభాషణలు లేవు.

ఏ పాత్రలో ఎవరు నటించారు: అమాయకత్వంతో కూడిన మిగిల్ పాత్రలో మోహన్ భగత్ ఒదిగిపోయారు. 'అర్జున్ రెడ్డి' ఫేమ్ భూషణ్ కల్యాణ్ ప్రొఫెసర్‌గా, హీరో తల్లిగా సురభి ప్రభావతి ఆకట్టుకున్నారు. ఖైదీగా లక్ష్మణ్, డిటెక్టివ్‌గా రవీంద్ర విజయ్ ఫర్వాలేదనిపించారు. హీరోయిన్‌ది పెద్దగా చెప్పుకోదగిన పాత్ర కాదు. దర్శకుడు అజయ్ నాగ్ తొలి ప్రయత్నంలోనే కొత్త పాయింట్‌ని టచ్ చేయడం ప్రశంసనీయం.

## టేస్టీ, క్రిస్పీ చెక్క అప్పాలు..

బోనాల సమయంలో చాలా మంది పిండివంటలు చేసుకుంటారు. వాటిలో అప్పాలు కూడా ఒకటి. కొందరు మురుకులు తిన్నట్టే.. మరికొందరు చెక్కలను చాయ్తో పాటు తీసుకుంటారు. ఇంట్లో సింపుల్గా చేసుకోగలిగే ఈ చెక్కలను పిల్లలనుంచి పెద్దలవరకు అందరూ ఇష్టంగా తింటారు. క్రిస్పీగా, టేస్టీగా ఈ చెక్కలను ఎలా చేయాలో.. ఇవి చేయానికి కావాల్సిన పదార్థాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

**కావాల్సిన పదార్థాలు ..** అల్లం – అర అంగుళం, వెల్లుల్లి – 8, పచ్చిమిర్చి – 2 , జీలకర్ర – 1 టీస్పూన్, ధనియాలు – 2 టీస్పూన్లు, బియ్యం పిండి – 2 కప్పులు, నీళ్లు – ఒకటిన్నర కప్పు, శనగపప్పు – 1 స్పూన్, పెసరపప్పు – 1 స్పూన్, కారం – 1 స్పూన్, ఉప్పు – రుచికి తగినంత, బటర్ – 1 టీస్పూన్, కరివేపాకు –2 టేబుల్ స్పూన్లు, నూనె – వేయించుకోవడానికి సరిపడేంత

**తయారీ విధానం ..**

ముందుగా శనగపప్పు, పెసరపప్పును కడిగి.. రెండు వంట చేసే రెండు గంటల ముందు నానబెట్టుకోవాలి. మిక్సీ జార్ తీసుకుని దానిలో అల్లం, వెల్లుల్లి రెబ్బలు, పచ్చిమిర్చి, జీలకర్ర, ధనియాలు మిక్సీ చేసుకోవాలి. ఇప్పుడు స్టౌవ్ వెలిగించి దానిపై నీళ్లు పెట్టుకోవాలి. దానిలో ముందుగా తయారు చేసుకున్న పేస్ట్, శనగపప్పు, పెసరపప్పు, కారం, రుచికి తగినంత ఉప్పు, బటర్ వేయాలి. నీటిలో పూర్తిగా కరిగిపోయి.. నీటిని మరగనివ్వాలి. దానిలో కరివేపాకు రెబ్బలను కట్ చేసి వేయాలి.



నీరు మరుగుతున్న సమయంలో బియ్యం పిండిని చల్లుకోవాలి. నీరు మరిగిన తర్వాత బియ్యం పిండిని దానిలో వేసి కలపి.. స్టౌవ్ ఆపేయాలి. పిండిని పట్టుకుంటే ముద్దలా అవ్వాలి. అప్పుడే బియ్యం పిండి, నీరు కరెక్ట్గా ఉన్నట్లు లెక్క. ఇప్పుడు పిండి కొద్దిగా కొద్దిగా తీసుకుంటూ.. నీళ్లు చల్లుతూ ముద్దగా చేసుకోవాలి. మిగిలిన పిండిపై కూడా మూత వేసే ఉంచాలి. పిండిపై ఎప్పుడూ మూత వేసే ఉంచాలి. లేదంటే పిండి డ్రై అయిపోతుంది. పిండిని కొంచెం కలుపుతున్నారంటే.. మిగిలిన దానిని మూత వేసి లేదా.. మెత్తటి క్లాత్ వేసి దానిని కప్పి ఉంచాలి. ఇప్పుడు మెత్తగా కలిపిన పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసుకుని ఒత్తుకోవాలి. కవర్కి నూనె రాసి.. వాటిపై ఇవి ఉంచి.. గ్లాస్తో లేదా గిన్నెతో ఒత్తుకోవాలి. ఇలా చేసుకున్న వాటిని నూనెలో వేయించుకోవాలి. అందుకు స్టౌవ్ వెలిగించి దానిపై కడాయి పెట్టాలి. దానిలో డీప్ ఫ్రైకి సరిపడా నూనె వేసుకుని కాగనివ్వాలి. నూనె వేడి అయ్యాక.. స్టౌవ్ మంటను మీడియం చేసి.. దానిలో ముందుగా తయారు చేసుకున్న చెక్కలు వేయాలి. గోల్డెన్ బ్రౌన్ కలర్ వస్తున్నప్పుడు వాటిని నూనె నుంచి తీసేయాలి.

మిగిలిన పిండితో మొత్తం ఇదే విధంగా చెక్కలు చేసుకోవాలి. ఈ రెసిపీని ఫాలో అయితే చెక్కలు కమ్మగా.. నోట్లో పెడితే కరిగిపోయేలా వస్తాయి. అంతేకాకుండా క్రిస్పీగా వస్తాయి. ఇవి మూడు, నాలుగు వారాల వరకు నిల్వ ఉంటాయి. పైగా వర్షాకాలంలో ఇలాంటి స్నాక్స్ మంచి కాంబినేషన్. పిల్లలకు స్నాక్స్గా పెట్టడానికి కూడా హెల్ప్ అవుతాయి. ఈ బోనాలకు మీరు కూడా ఈ టేస్టీ చెక్క అప్పాలు తయారు చేసి.. హాయిగా లాగించేయండి.

# సినిమా రివ్యూ

హ్యాపీ డేస్.. కొత్త బంగారు లోకం లాంటి చిత్రాలతో ఒకప్పుడు య-ువతను ఒక ఊపు ఊపిన హీరో వరుణ్ సందేశ్. ఆ తర్వాత సరైన సినిమాలు పడక అతను అంతర్ధానం అయిపోయాడు. కొన్నేళ్లుగా అసలు సినిమాలే చేయని వరుణ్.. ఇప్పుడు 'నింద' అనే చిత్రంతో రీఎంట్రీ ఇచ్చాడు. రాజేష్ జగన్నాథం తనే స్క్రిప్టు సమకూర్చుకుని.. స్వీయ నిర్మాణంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దీని విశేషాలేంటో చూద్దాం పదండి.

కథ:

ఆంధ్రా ప్రాంతంలోని కాండ్రకోట అనే గ్రామంలో మంజు అనే అమ్మాయి హత్యాచారానికి గురవుతుంది. ఆ కేసులో నిందితుడిగా అరెస్టయిన బాలరాజు (ఛత్రపతి శేఖర్)కు వ్యతిరేకంగా అన్ని ఆధారాలు ఉండడంతో జడ్జి సత్యానంద్ అతడికి ఉరి శిక్ష విధిస్తాడు. కానీ బాలరాజు నిర్దోషి అని సత్యానంద్ మనసు చెబుతుంది. ఈ అపరాధ భావంతోనే ఆయన కన్ను మూస్తాడు. దీంతో ఆయన కొడుకు వివేక్ (వరుణ్ సందేశ్) ఈ కేసు సంగతేంటో తేల్చి.. తండ్రి ఆత్మకు శాంతినివ్వాలనుకుంటాడు. మరి తన పరిశోధనలో ఏం తేలింది.. నిజంగా బాలరాజు.. మంజుపై అత్యాచారం జరిపి హత్య చేశాడా..? చివరికి బాలరాజు నిర్దోషిగా బయటికి వచ్చాడా..? బాలరాజు కాని పక్షంలో మంజుని చంపిందెవరు? ఈ ప్రశ్నలన్నింటికీ తెర మీదే సమాధానాలు తెలుసుకోవాలి.

కథనం-విశ్లేషణ:

డిజిటల్ మార్కెట్ ఊపందుకున్నాక వివిధ భాషల్లో క్రైమ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్లు ఓటీటీలను ముంచెత్తేస్తున్నాయి. సంచలనం రేపిన కేసులను ఎంచుకుని.. వాటి పూర్వాపరాలను పరిశీలించి ఆసక్తికర స్క్రిప్టుగా మలుచుకుని సినిమాలు తీసి మెప్పిస్తున్నారు దర్శకులు. ఈ విషయంలో మలయాళ దర్శకుల నైపుణ్యమే వేరు. మర్డర్ కేసులతో ముడిపడ్డ సినిమాలను వాళ్లు డీల్ చేసే విధానం ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. ప్రేక్షకుల్లో అడుగడుగునా క్యూరియాసిటీ పెంచేలా.. ఉత్కంఠతో ఊగిపోయేలా క్రైమ్ థ్రిల్లర్లను పకడ్బందీ స్క్రీన్ ప్లేతో నడిపిస్తుంటారు అక్కడి దర్శకులు. మన దగ్గర కూడా 'హిట్' సిరీస్ తో శైలేష్ కొలను లాంటి వాళ్లు ఈ తరహా సినిమాలకు బాటలు పరిచారు. ఈ క్రమంలోనే కొత్త దర్శక నిర్మాత రాజేష్ జగన్నాథం కూడా 'నింద'తో ఇలాంటి ప్రయత్నమే చేశాడు. ఐతే ఎంచుకున్న కేసు ఆసక్తికరమే కానీ.. పైన చెప్పుకున్నట్లు ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచేలా.. ఉత్కంఠ రేపేలా కథనాన్ని మాత్రం తీర్చిదిద్దుకోలేకపోయాడు. కథలోని ట్విస్ట్..




అక్కడక్కడా కొన్ని సీన్లు బాగున్నా.. ఓవరాల్ గా ఒక పకడ్బందీ థ్రిల్లర్ కు ఉండాల్సిన లక్షణాలు మాత్రం ఇందులో మిస్సయ్యాయి.

"వంద మంది దోషులు తప్పించుకున్నా పర్వాలేదు.. ఒక్క నిర్దోషికి శిక్ష పడకూడదు" అనే ప్రాథమిక న్యాయ సూత్రం ఆధారంగా నడిచే కథ ఇది. హత్య కేసులో దోషిగా తేలి ఉరి శిక్ష కూడా పడ్డ ఖైదీ అమాయకుడని భావించి హీరో అతణ్ని బయటికి తీసుకురావడానికి భిన్నమైన శైలిలో ఈ కేసును పరిశోధించే నేపథ్యంలో ఈ సినిమా ముందుకు సాగుతుంది. సినిమాను మొదలుపెట్టిన తీరు 'నింద' పట్ల ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఈ కేసును తప్పుదోవ పట్టించిన వాళ్లందరినీ కిడ్నాప్ చేసి ఒక చోటికి చేర్చి వాళ్ల ద్వారా అసలు నిజాలు బయటపెట్టించడంలో వైవిధ్యం కనిపిస్తుంది. ఐతే ఈ కిడ్నాప్ డ్రామాకు మంచి వెయిట్ ఇచ్చి.. హీరోను కూడా నిగూఢంగా చూపించి.. అసలు ముం దేం జరిగింది.. ఇప్పుడేం జరుగుతోంది.. తర్వాత ఏం జరగబోతోందనే రేకెత్తించాడు దర్శకుడు. కానీ ముసుగు వేసుకుని విపరీతమైన బిల్డప్ ఇచ్చే హీరో.. నిజాలు వెలికి తీసే పనిలో పెద్దగా సాధించేదేమీ ఉండదు. ఉన్నట్లుండి ఆ ముసుగు తీసేసి తనెవరో చెప్పాక ఒక్కొక్కటిగా అసలు విషయాలు బయటపడతాయి. ఆ మాత్రానికి అంతకుముందు ఆ కిడ్నాప్.. ఆ ముసుగు డ్రామా ఎందుకో అర్థం కాదు. ఒక్కసారి హీరో ఎవరన్నది అందరికీ తెలిసిపోయాక ఒక సగటు క్రైమ్ స్టోరీలాగే నడుస్తుంది 'నింద'. మర్డర్ కేసుకు సంబంధించి ఒక్కో చిక్కుముడి వీడడం.. చివరికి ట్విస్ట్ వెల్లడి కావడం.. ఇలా మామూలు టెంప్లేట్లోనే సినిమా నడుస్తుంది. హత్య చేసిన వ్యక్తి ఎవరన్నది వెల్లడైనపుడు ప్రేక్షకులు కొంచెం షాకవుతారు కానీ.. ఒక పల్లెటూరిలో జరిగిన హత్య విషయంలో అసలు విషయాలు మరుగున పడిపోయి నిర్దోషి జైలు పాలయ్యే క్రమం అంత లాజికల్ గా అయితే అనిపించదు.

అతణ్ని ఎవరు ఎందుకు ఫ్రేమ్ చేశారనే విషయంలో సన్నివేశాలు కన్విన్సింగ్ గా అనిపించవు. సినిమాకు మొదట్లో ఇచ్చిన బిల్డప్ కు.. చివరికి ముగిసే తీరుకు పొంతన ఉండదు. కథలో ఉన్న ట్విస్టు వల్ల ఏం జరిగిందో తెలుసుకోవాలని ప్రేక్షకులు ఆసక్తితోనే చివరి వరకు చూస్తారు కానీ.. వారిని ఉత్కంఠతో ఊపేసేలా మాత్రం కథనం లేదు. దర్శకుడు కథ నుంచి డీవియేట్ కాకుండా సిన్సియర్ గానే సినిమా తీసినా.. కథనంలో బిగి చూపించలేకపోయాడు. బడ్జెట్ పరిమితుల వల్ల కూడా క్రైమ్ థ్రిల్లర్లలో ఉండాల్సిన క్వాలిటీ కూడా ఇందులో మిస్సయింది. రొటీన్ కు భిన్నమైన సినిమాలు.. క్రైమ్ థ్రిల్లర్స్ ఇష్టపడేవారు ఎక్కువ అంచనాలు పెట్టుకోకుండా 'నింద' మీద ఒక లుక్కేయొచ్చు.

నటీనటులు:

తెలుగు ప్రేక్షకుల దృష్టిలోంచి పూర్తిగా పక్కకు వెళ్లిపోయిన వరుణ్ సందేశ్.. తాను ఇంతకుముందు చేసిన చిత్రాలకు పూర్తి భిన్నమైన కథతో రీఎంట్రీ ఇచ్చాడు. ఇలాంటి కథలో అతణ్ని చూడడం కొత్తగా అనిపిస్తుంది. నటనలో మునుపటితో పోలిస్తే పరిణతి వచ్చింది. వివేక్ పాత్రను సటిల్ గా పండించే ప్రయత్నం చేశాడు. వరుణ్ బాగానే ట్రై చేసినా.. తన నటన ఆ పాత్రకు వెయిట్ మాత్రం తీసుకురాలేకపోయింది. తన లుక్ బాగుంది. కథానాయిక శ్రేయారాణి రెడ్డి పాత్ర పరిమితం. కీలక పాత్రలో అన్నీ రాణించింది. ఛత్రపతి శేఖర్ బాలరాజు పాత్రలో ఒదిగిపోయాడు. తనికెళ్ల భరణి తక్కువ సన్నివేశాల్లోనే బాగా చేశారు. భద్రమ్.. మిగతా ఆర్టిస్టులు తమ పరిధి మేరకు నటించారు.

సాంకేతిక వర్గం:

'నింద' సాంకేతికంగా సోసోగా అనిపిస్తుంది. క్రైమ్ థ్రిల్లర్లలో ప్రేక్షకులు ఆశించే క్వాలిటీ ఇందులో కనిపించదు. చాలా పరిమితుల మధ్య సినిమా తీసిన విషయం అర్థమవుతుంది. సంతు ఓంకార్ బ్యాగ్రౌండ్ స్కోర్ పర్వాలేదు. పాటలు బాలేవు. అనవసరంగా ఇరికించినట్లు అనిపిస్తాయి. రమీజ్ నవీన్ ఛాయాగ్రహణం ఓకే. తనే సొంతంగా ప్రొడ్యూస్ చేసుకోవడంతో పాటు స్క్రిప్టు సమకూర్చుకుని సినిమా తీసిన రాజేష్ జగన్నాథం.. ఉన్నంతలో మంచి ప్రయత్నమే చేశాడు. తను ఎంచుకున్న కథ బాగున్నా.. దాన్ని ఆసక్తికరంగా నడిపించే కథనం.. అవసరమైన ప్రొడక్షన్ సమకూర్చుకోలేకపోయాడు. రచయిత.. దర్శకుడిగా అతడికి యావరేజ్ మార్కులు పడతాయి.

చివరగా: నింద.. మంచి కాన్సెప్ట్- వీక్ నరేషన్

ఫీల్ గుడ్ సినిమాలు కావాలంటే మాలీవుడ్డే బెస్ట్ అని ఫ్యాన్స్ అంటుంటారు. అలా ఇప్పటికే ఎన్నో మలయాళ సినిమాలు ఈ విషయాన్ని ప్రూవ్ చేశాయి కూడా. తాజాగా విడుదలయిన మరో ఫ్యామిలీ కామెడీ డ్రామా కూడా ఈ లిస్ట్‌లోకి యాడ్ అవుతుంది. అదే 'గురువాయూర్ అంబలనడయిల్' . బ్రొమాన్స్, కామెడీ లాంటి అంశాలు మెయిన్ హైలెట్‌గా నిలిచిన ఈ మూవీ ఇటీవల ఓటీటీలో విడుదలయ్యింది. దీంతో తెలుగు ప్రేక్షకులు కూడా ఈ సినిమాను చూడడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఇంతకీ ఈ మూవీ ఎలా ఉందంటే.?

కథ..

'గురువాయూర్ అంబలనడయిల్' కథ విషయానికొస్తే.. విను (బేసిల్ జోసెఫ్).. దుబాయ్‌లో ఉద్యోగం చేస్తుంటారు. తనకు అంజలి (అనస్వర రాజన్)తో పెళ్లి కుదురుతుంది. పెళ్లి కోసం కేరళకు రావాలని ప్లాన్ చేసుకుంటాడు. అయితే ఈ పెళ్లి జరగడానికి కారణం ఆనందన్ (పృథ్వీరాజ్ సుకుమారన్). వినుకు గతంలో ఒక గర్ల్‌ఫ్రెండ్ ఉందని తెలిసినా తన మనసు మార్చి తన చెల్లి అంజలితో పెళ్లి కుదిరేలా చేస్తాడు ఆనందన్. అందుకే అంజలితోకంటే ఆనందన్‌తోనే ఎక్కువ క్లోజ్‌గా ఉంటాడు విను. అప్పటికే ఆనందన్‌కు పెళ్లయ్యి ఒక బాబు కూడా ఉంటాడు. కానీ ఆనందన్‌తో గతంలో జరిగిన గొడవల వల్ల తన భార్య పార్వతి (నిఖిలా విమల్).. తన పుట్టింటికి వెళ్లిపోతుంది.

తన సంతోషానికి ఆనందనే కారణం అనుకున్న విను.. తనను తన భార్యను కలపాలని అనుకుంటాడు. అంజలి పెళ్లికి పార్వతీతో పాటు తన కుటుంబాన్ని ఆహ్వానించమంటాడు. విను చెప్పిన ఐడియాను ఫాలో అయ్యి పార్వతీని క్షమాపణ అడిగి తిరిగి ఇంటికి తీసుకొస్తాడు ఆనందన్. దుబాయ్ నుండి రాగానే ముందుగా ఆనందన్‌ను కలవడానికే వస్తాడు



విను. అప్పుడే తనకు ఒక షాకింగ్ విషయం తెలుస్తుంది. గతంలో తను ప్రేమించిన అమ్మాయినే ఆనందన్ పెళ్లి చేసుకున్నాడు అని. ఇప్పుడు విను ఏం చేస్తాడు? ఈ పెళ్లిని ఎలా క్యాన్సల్ చేస్తాడు? అసలు ఈ పెళ్లి జరుగుతుందా లేదా? ఇదంతా తెలిసిన ఆనందన్ ఏం చేస్తాడు? అనేది తెరపై చూడాల్సిన కథ.ల

ప్లస్‌లు..

'గురువాయూర్ అంబలనడయిల్'లో కామెడీ చాలావరకు వర్కవుట్ అయ్యేలా చేశాడు దర్శకుడు విపిన్ దాస్. మూవీ ఎక్కడైనా కాస్త బోర్ కొడుతుందేమో అని అనిపించేలోపే ఏదో ఒక కామెడీ సీన్‌తో దానిని ముందుకు తీసుకెళ్లాడు. ఇక పృథ్వీరాజ్ సుకుమారన్, బేసిల్ జోసెఫ్ లాంటి యాక్టర్ల నటన గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అంకిత్ మీనన్ అందించిన సంగీతం.. కామెడీ సీన్స్‌ను మరింత ఎంటర్‌టైనింగ్‌గా మార్చాయి. అంజలితో పెళ్లిని క్యాన్సిల్ చేయడానికి విను వేసే ప్లాన్స్ బాగుంటాయి. తర్వాత ఏం జరుగుతుంది అని ప్రేక్షకులను ఆసక్తిగా చూసేలా చేస్తాయి. అలా 'గురువాయూర్ అంబలనడయిల్' ఒక రొటీన్ మలయాళ ఫ్యామిలీ కామెడీ డ్రామా చిత్రంగా ఆడియన్స్‌ను ఎంటర్‌టైన్ చేస్తుంది. ఈ సినిమాకు పెద్ద ప్లస్‌గా మారింది క్లైమాక్స్.

మైనస్..

పృథ్వీరాజ్ సుకుమారన్, బేసిల్ జోసెఫ్‌లోని ఇలాంటి పాత్రల్లో ఇప్పటికే చాలాసార్లు చూశాం కదా అనే ఆలోచన ప్రేక్షకులకు రావచ్చు. కామెడీ వర్కవుట్ అయినట్టే అనిపించినా.. చాలా చోట్ల అది కాస్త బోరింగ్ అని కూడా అనిపిస్తుంది. ఇక అనస్వరా రాజన్ లాంటి హీరోయిన్‌ను ఎంపిక చేసి తనకు మినిమమ్ స్కోప్ లేని క్యారెక్టర్ ఇచ్చినట్టు అనిపిస్తుంది. యోగి బాబు లాంటి స్టార్ కామెడియన్‌ను 'గురువాయూర్ అంబలనడయిల్' కోసం రంగంలోకి దించి.. తనను పూర్తి స్థాయిలో వినియోగించుకోలేదేమో అనే ఆలోచన వస్తుంది. సినిమాలో ఉన్నది ఒకే ట్విస్ట్. ఆ ట్విస్ట్‌ను కూడా మొదట్లోనే రివీల్ చేసి తర్వాత అంతా రొటీన్ అనిపించేలా చేశాడు దర్శకుడు విపిన్ దాస్. పలుచోట్ల అనవసరమైన క్యారెక్టర్లను ఇంట్రడ్యూస్ చేశాడేమో అని కూడా అనిపించవచ్చు. మొత్తానికి కాసేపు నవ్వుకోడానికి 'గురువాయూర్ అంబలనడయిల్' చూడొచ్చు. ఈ మూవీ 'డిస్నీ ప్లస్ హాట్ స్టార్'లో స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగులోనూ చూడవచ్చు.

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)

నిర్వహణ :
స్వర్ణకంకణ సన్మానిత,
జ్యోతిష్య చూడామణి,
జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా॥ఈడ్పుగంటి పద్మజారాణి
91 9849250852,
91 7506976164
padma.suryapaper@gmail.com



# 7.7.2024 నుంచి 13.7.2024 వరకు



## మేష రాశి

అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

వారం ప్రారంభంలో విదేశాల్లో ఉన్న తల్లి తరుపు బంధువుల సహకారము కోరుకుంటారు. ఆధ్యాత్మిక వ్యక్తులు ప్రసంగాలు మనసుకి సంతోషాన్నిస్తాయి.మనసు ఘర్షనాత్మకముగా ఆలోచనలు ఆస్తిరముగా ఉంటాయి. కుటుంబములో బంధువుల రాక, ఆకస్మిక ఖర్చులు పెరిగినప్పటికి సంతోషకరమైన వాతావరణం. నూతన అంశాలు తెలుసుకుంటారు, నచ్చిన వస్తువులు కొనుగోలుకై అధిక వ్యయాలు. ఆరోగ్యము బాగుంటుంది. సమయానికి ఆశించిన పనులు మీ క్రింద సిబ్బంది, సేవకులు మొదలైన వ్యక్తుల సహకారంతో ముందుకు సాగుతాయి, మీకు గుర్తింపు గౌరవం వారి వలన లభిస్తుంది. ఆ రీత్యా వారు తగిన ప్రతిఫలం ఆశిస్తారు. ఆ విషయంలో మీరు చేసే ప్రత్యుపకారము నాకు దీర్ఘకాలిక సంబంధబాంధవ్యాలను వృత్తిలో, సేవలు పొందగలరు.



## వృషభరాశి

కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

వారం ప్రారంభంలో మనసు ప్రశాంతంగా తక్కువగా ఉంటుంది. వ్యక్తుల సహకారం మీరు ఆశించిన స్థాయిలో లేకపో యినప్పటికీ మొత్తం మీద స్వయం నిర్ణయాలు తీసుకుంటే ధైర్యంగా ముందుకు వెళ్లిపోతారు. విద్యార్థులు విదేశీ విద్య కొరకు గట్టిగా కృషి చేస్తారు. దూర ప్రయాణాలు అవకాశం. గృహ నిర్మాణ అంశములపై ప్రయత్నాలు పెంచుతారు. వాహనములు నడిపేటప్పుడు తగిన జాగర్త మేలు. గృహ వాహన సంబంధ ఖర్చులు చేసేటపుడు కొత్త వ్యక్తులతో మోస పోకుండా ఆలోచించాలి. మాట్లాడేటపుడు మాటలు అపార్ధముకాకుండా అలోచించి మాట్లాడుట మేలు. మంచి వ్యక్తుల సహకారము లభిస్తుంది. పెట్టుబడులు పెట్టేటప్పుడు జాగర్తగా వ్యవహరించాలి. స్త్రీ సంతానమునకు లలితకళల కి సంబంధించిన వృత్తి అవకాశములు.



## మిధున రాశి

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో మాటల వల్ల వృత్తి పరంగా, మరియు కుటుంబ సభ్యులతో అపార్ధములు రాకుండా జాగ్రత్త పడాలి. ప్రయాణాల్లో విలువైన వస్తువులు పోగొట్టుకోకుండా జాగర్త తీసుకోవాలి, అపరిచితులవలన ఆకస్మిక మోసానికి, లేదా ఖర్చులకి అవకాశములు. ముఖ్య పనుల్లో ఆలస్యము, బద్ధకించకుండా ముందుకు వెళ్లే ప్రయత్నాలు చేయటం కొంత మంచిది. వ్యాయమ ప్రాణాయామములు, మెడిటేషన్ పై శ్రద్ధ ముఖ్యము. వారం మధ్యలో క్రీడాల్లో ఉత్యహము గా పాల్గుంటారు. గుర్తింపు గౌరవము కి అధిక శ్రమ. తోబుట్టువులు సహకరిస్తారు. మిత్రుని సహాయముతో వృత్తిలో దూరప్ర దేశాల్లో అవకాశములు. కుటుంబ ఆదాయము, వాతావరణము బాగుంటాయి. ల



## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

ప్రారంభంలోమనసు కొత్త ప్రణాళికలతో ఉంటుంది. దూర ప్రదేశాలలో ఉండే బంధువులతో ఫోన్ పలకరింపులు. ఆధ్యాత్మిక ప్రదేశములు చూడడానికి ప్రయత్నాలు చేస్తారు. దూర ప్రదేశములలో ఉన్న తోబుట్టువులతో ముఖ్యమైన విషయాల రిత్యా సుదీర్ఘ చర్చలు, పిత్రార్జిత భూమి మరియు గృహ అంశాలలో ముఖ్య బంధువర్గముతో ఘర్షణ లేకుండా చూసుకోవాలి. దీర్ఘకాలిక అనారోగ్యాలు ఇబ్బంది పెడతాయి. మీ ఆరోగ్యముపై శ్రద్ధ అవసరము. అవసరమైతే అశ్రద్ధచేయకుండా వైద్యులని కలవటం మంచిది. ముఖ్య విషయాల నిర్ణయములో పెద్దల సహకారముకై ప్రయత్నాలు. వృత్తిలో చిన్నపాటి విబేధములు. దైనందన జీవనములో కొత్త మార్పులు. ఆశించిన ఫలితల్లో అసంతృప్తి. విద్యార్థులకు విద్య మీద శ్రద్ధ తీసుకోవాలి,



## సింహ రాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

ప్రారంభంలో వ్యాపారములో స్నేహితుల సహకారముతో కొత్త నిర్ణయాలు తీసుకుంటారు. దూరప్రాంతాల్లో ఆధ్యాత్మిక వ్యక్తులను ఆశీస్సులకై కలుస్తారు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ఆత్మీయుల కొరకు బహుమానములు కై ఖర్చులు, సంఘంలో పలుకుబడి కలిగిన వ్యక్తుల సహకారంతో నూతన ఆలోచనలకు శ్రీకారం చుడతారు చారిటబుల్ ట్రస్ట్ లకి మొదలైన వాటికి విరాళాలు అందిస్తారు. వాహన మార్పుకై ఆలోచనలు, గృహ సంబంధ వస్తువుల మార్పుకై ప్రయత్నాలు సఫలము. ముఖ్యముగా రాజకీయముగా పలుకుబడి ఉన్న బంధువులు తో మీ కమ్యూనికేషన్ బాగుంటుంది. మధ్యలో ఆరోగ్యముపై శ్రద్ధ వహించాలి. ముఖ్య పనుల్లో ఆటంకాలు, అనుకోని ఇక్కట్లు ఎదురయ్యే సూచన దృష్ట్యా వీలైనంత ముందు జాగర్తలు మంచిది.



## కన్యా రాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

వారం ప్రారంభంలో సంతానముకి అభివృద్ధి. భాగస్వామికి ఆదాయపరంగా అభివృద్ధి, నూతన అవకాశాలు. ఇంజనీరింగ్ మెడికల్ విద్యార్థులకి అనుకూలం. సమయస్పూర్తి గా వ్యవహారా లునడుస్తాయి. చాకచక్యము, చలాకిగా మాట్లాడుతూ అన్ని విశ్లేషస్తూ నిర్ణయాలు తీసుకుంటారువృత్తి పరంగా భాగస్వాములతో ఉన్న అభిప్రాయ భేదాలు కొంతవరకు తగ్గిపోతాయి. గృహ సంబంధ రెంట్ వసులు అవుతాయి. ఆగిన టాక్సులు చెల్లిస్తారు. దగ్గర ప్రయాణాలు, రిసార్ట్స్ వంటివి బంధు మిత్రులతో కలిసి సందర్శన కి అవకాశములు. కంటి విషయములో శ్రద్ధ అవసరము మధ్యలో పనులు వాయిదా, ఆరోగ్యము మరియు ప్రయాణాల్లో జాగర్తలు తీసుకువాలి. రావలసిన ధన ఆదాయము లో ఆటంకాలు, రుణాలు చెల్లించే ప్రయత్నాలు.



## తులారాశి

చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో వృత్తిపరంగా అధికారము పెరుగుతుంది. దర్పముగా ఉంటారు. ఆత్మవిశ్వాసం తో నూతన ప్రయత్నాలు. విదేశీ అవకాశములు. విదేశ విద్యకై స్త్రీ సంతానముకి కొత్త అవకాశములు. సంతానముకై ముఖ్యమైన స్కూల్ సంబంధ స్టేషనరీ కొనుగోలు. ధైర్యముగా నిర్ణ యాలు నాయకత్వ లక్షణాలు. రాజకీయ నాయకుల సహకారము లభిస్తుంది. రాజకీయాల్లో ఉన్నవారికి పలుకుబడి కొంతమేర పెరుగుతుంది. తండ్రితో సంబంధ బంధవ్యలు. దూరప్రదేశాల్లో ఉన్న మిత్రులు సహకారము ధన విషయములో. మీ ఆత్మ విశ్వాసమే మీకు శ్రీరామ రక్ష. స్వశక్తితో విజయసాధనకై లక్షన్ని ఏర్పరచుకొని ఆ మార్గము లు విజయాన్ని సాధించే ప్రయత్నాల్లో పట్టుదలగా ముందుకు సాగుతారు. ఉపాధి కొరకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి.



## వృశ్చిక రాశి

విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ట 1,2,3,4 పాదములు

ప్రారంభంలో గురు సమానులను కలుస్తారు. మీ లక్ష్య సాధన, వృత్తి నిర్వహణలో అసమాన ప్రతిభ చూపిస్తూ మీకు మీరే సమానము అనిపించుకుంటారు. కొలీగ్స్, మిత్రుల సహకారము తో మీరు ఆశించిన లక్ష్యాన్ని సులభముగా సాధిస్తారు. నూతన వృత్తులలో అవకాశములు వస్తాయి. వ్యక్తుల సహకారాన్ని పొందుతారు. సంఘ సేవ చేస్తారు. ఉపాసన బలం బాగుంటుంది విదేశాల్లో ఉన్న ఆధ్యా త్మిక వ్యక్తుల సహకారము, గురువులు పెద్దల ఆశీస్సులతో అనుకున్నపనులు ముందే పూర్తి చేసి విజయ కేతనము ఎగురవేస్తారు. విద్యార్థులకి సమయము చాలా అనుకూలము. వారాంతంలో ఎప్పటినుంచో అనుకుంటున్నా దీర్ఘ కాలిక పెట్టుబడులు పెట్టడం కోసం వినూత్న ఆలోచనలు చేస్తారు. అమ్మవారి ఆశీస్సులతో ముందుకు వెళ్ళిపోతారు. ఋణములు చెల్లిస్తారు.



## ధనస్సు రాశి

మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరషాడ 1వ పాదము

వారం ప్రారంభంలో ఆరోగ్యపరంగా శ్రద్ధ అవసరం, సమయానికి ఆహార స్వీకరణ విశ్రాంతి ముఖ్యం. ఆర్థిక, వాగ్దానాల విషయాల్లో ముఖ్యముగా భూసంబంధ ఆదాయం రావడంలో ఆలస్యాలు. సోదర వర్గము వారినుండి ముఖ్య విషయాల్లో,సమావేశాల్లో కమ్యూనికేషన్ సమస్య లేకుండా జాగ్రత్తగా సమయస్పూర్తిగా వ్యవహరిస్తారు. ప్రయాణాల్లో, ముఖ్యమైన నిర్ణయ విషయాలలో కొంతమేర ఆకస్మిక వాయిదాలు. విద్యార్థులకు విద్యాపరంగా అభివృద్ధి. విదేశాల్లో ఉన్న తోబుట్టువుల, మరియు సంతానము సహకారము అందుతుంది. పెద్దల గురువుల ఆశీస్సులు అందుకుంటారు, ఆధ్యాత్మిక క్షేత్ర సందర్శన. వారం మధ్యలో మీ వృత్తికి సంబంధించిన అభివృద్ధి అంశాలలో కొత్త ఆలోచన. ఆత్మవిశ్వాసం,అధికారము పెటిగి ఉత్సాహముగా ఉంటారు. తల్లి గారికి ఆదాయము అందుతుంది.



## మకర రాశి

ఉత్తరషాడ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ట 1,2 పాదములు

వారం ప్రారంభంలో కళా రంగంలో ఉండే వారికి సత్కారాలు.మీపై మీకు శ్రద్ధ పెరుగుతుంది, మనసు ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటుంది. వృత్తి రీత్యా ప్రయాణాలకి, సోదర సమానులైన ఆత్మీయుల నుండి ఆహ్వానములు, వారం మధ్యలో చేస్తున్న వృత్తిలో అధికారులతో, ఆత్మీయులైన మిత్రులతో జాగర్తగా మాట రాకుండా చూసుకువాలి. కమ్యూనికేషన్ లో అపార్ధాలు, చికాకులు, ఆర్థికపరమైన ఆటంకములు కొంత చికాకు కలిగిస్తాయి. గృహ, వాహన విషయాలలో చిన్న చిన్న విషయాలు మీకు ఇబ్బంది బాధ కలిగిస్తాయి. సర్దుకుపోవడమే మంచిది. ఆశించిన వ్యక్తుల సహకారము ఆనందాన్ని ఇస్తుంది. మనసుకి ప్రశాంతత తగ్గినప్పటికి కమ్యూనికేషన్ సమయములో జాగర్త అవసరము.



## కుంభ రాశి

ధనిష్ట 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో భాగస్వాములు మధ్య మనస్పర్థలేమన్న ఉన్నా చిన్నపాటివి తొలగి తాత్కాలిక ఎడబాటునుండి కలుస్తారు వ్యాపార భాగస్వాములతో వీలైనంత ఆలోచించి మంతనములు సాగించటం మేలు. శత్రువులపై విజయం, రుణములు చెల్లింపు, రోగ నిరోధక శక్తిని పెంచుకోవడం, అనే అంశములు పై దృష్టి సారిస్తారు నాయకత్వ లక్షణాలు పెంచుకుంటూ సమయస్పూర్తిగా మాట్లాడుతూ సంఘంలో గౌరవ ప్రతిష్టలు పెంచుకుంటూ వ్యక్తుల మనసును గెలుస్తారు. పౌరుషం పెరుగుతుంది నిర్ణయాలు తీసుకుంటారు. రాజకీయరంగంలో ఉండే వారికి అనుకూలం. వారం మధ్యలో స్థిరత్వం లేని ఆలోచనలు, అసంతృప్తిగా పనులు, ఆర్థిక చికాకులు. ఆకస్మిక ప్రయాణాలు. మనసు ప్రశాంతత తగ్గి ఆధ్యాత్మిక చింతనకి అధిక ప్రాధాన్యత ఇస్తారు.



## మీనరాశి

పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాబాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో ఆత్మీయ మిత్రులు మిమ్మల్ని కలవడానికి ప్రయత్నం చేస్తారు. సంతానముతో అభిప్రాయ భేదములు రాకుండా ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలి. మనసు ప్రశాంతత కొంత తగ్గినప్పటికీ, ఆధ్యాత్మిక ఆలోచనలతో దాన్ని అధిగమించే ప్రయత్నాలు చేయాలి. ఒక ముఖ్యమైన వార్త అందుకుంటారు. వారం మధ్యలో మీ భాగస్వామిసమయ స్పూర్తి, సలహాలువలన మీరు ఇబ్బందులను కొంత వరకు అధిగమిస్తారు. చాలాకాలంగా ఎదురు చూస్తున్న భూమికి సంబంధించి సెటిల్మెంట్ వ్యవహారాల్లో కొంచెం ఆటంకములు, మనసు కొంత తెలీని బాధ. వృత్తి ప్రదేశములో కొంత అలజడి ,వాగ్వాదములకి దూరముందుట మంచిది. వీలైనంతవరకు తక్కువ ప్రతిస్పందించటం.


కీర్తి శెట్టి